
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పల్నాడు జిల్లా వార్తలు

5

శుక్రవారం 1 మార్చి 2024

హెలిపాడ్ దిగే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న యరపతినేని శ్రీనివాసరావు, పార్టీ శ్రేణులు



సభావేదిక ప్రాంగణాన్ని చదును చేసి పనులు చేస్తున్న దృశ్యం



భారీగా.. రా.. కదలిరా

- రేపు దాచేపల్లిలో సభ
- జన సమీకరణకు విస్తృత ఏర్పాట్లు
- విజయవంతం చేయాలని నేతల ప్రచారం
- శ్రీకృష్ణదేవరాయలు, మక్కెన సహా పలువురి చేరికలు

(పిడుగురాళ్ల, గుంటూరు సిటీ/నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

రాజకీయ సమీకరణలు చకచకా మారుతున్న నేపథ్యంలో పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గం దాచేపల్లిలో శనివారం రా.. కదలిరా సభ నిర్వహణకు టీడీపీ నాయకులు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సభకు ప్రజలు పెద్దసంఖ్యలో తరలి రావాలని టీడీపీ నేతలు విస్తృత ప్రచారం చేస్తున్నారు. రా కదలిరా సభకు గురజాల సమీపంలోని అద్దంకి-నార్కెట్‌పల్లి రాష్ట్ర రహదారి పక్కన తిరుమల కోల్డ్ స్టోరేజి పక్కన ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం మధ్యాహ్నం 2 గంటలకు జరిగే సభలో టీడీపీ అధినేత చంద్రబాబుతో పాటు రాష్ట్ర నేతలు పాల్గొననున్నారు. చంద్రబాబు పాల్గొంటున్న సభను ప్రతిష్ఠాత్మకంగా స్వీకరించిన నేతలు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. సభను విజయవంతం చేసేందుకు నియోజకవర్గ ఇన్‌చార్జిలు, అసెంబ్లీ అభ్యర్థులు బాధ్యతలు స్వీకరించారు. ప్రతి నియోజకవర్గం నుంచి వేలాదిగా జనసమీకరణకు ఏర్పాట్లు చేస్తున్నారు. సభకు తరలివచ్చే వారి కోసం ఎక్కడికక్కడ ప్రత్యేకంగా వాహనాలు ఏర్పాటు చేస్తున్నారు. సమయం తక్కువగా ఉండటంతో గ్రామాలు, పట్టణాల్లో సభకు సంబంధించి విస్తృత ప్రచారం చేస్తున్నారు.

కేడర్‌లో సమరోత్సాహం

పార్టీ అభ్యర్థుల ప్రకటన అనంతరం గురజాలలో జరిగే రా కదలిరా సభ నిర్వహణతో పార్టీ క్యాడర్‌లో సమరోత్సాహం నెలకొంది. ఇప్పటికే పల్నాడు జిల్లా వినుకొండ, మాచర్ల, సత్తెనపల్లి, చిలకలూరిపేట నియోజకవర్గాలకు అభ్యర్థులను అధినేత చంద్రబాబు ప్రకటించిన విషయం తెలిసిందే. అదేవిధంగా గురజాలకు యరపతినేని శ్రీనివాసరావు పేరు ఖరారైందన్న ప్రచారం జరుగుతుండటం.. ఈ నియోజకవర్గ పరిధిలో సభ ఏర్పాటుతో ఆయన నేతృత్వంలో భారీగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. వినుకొండ టీడీపీ అభ్యర్థి జీవీ ఆంజనేయులు, సత్తెనపల్లి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ, చిలకలూరిపేట అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు, మాచర్ల అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి, నరసరావుపేట ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు, పెదకూరపాడు ఇన్‌చార్జి కొమ్మాలపాటి శ్రీధర్ తదితరులు జనసమీకరణకు ఏర్పాట్లు చేస్తున్నారు. సభ విజయవంతానికి క్యాడర్‌ను సమాయత్తపరుస్తున్నారు. దాచేపల్లి సభలో వైసీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుతో పాటు వినుకొండ మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు సహా పలువురు నాయకులు, స్థానిక సంస్థల ప్రతినిధులు చంద్రబాబు సమక్షంలో టీడీపీ కండువా కప్పుకోనున్నారు. ఈ అంశాన్ని లావుతో పాటు మక్కెన గురువారం ధ్రువీకరించారు. టీడీపీలో ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి కూడా చేరతారన్న ప్రచారం ఉంది. అయితే ఆయన చేరిక సందిగ్ధంలో ఉందని టీడీపీ నేతలు తెలిపారు. తాను ఇంకా నిర్ణయం తీసుకోలేదని జంగా చెబుతున్నారు. ఆయన ఇంకా వైసీ పీకి రాజీనామా కూ డా చేయలేదు. అయి తే జంగా అభ్యర్థి త్వంపై టీడీపీ అధిష్ఠానం నరసరావుపేట, గురజాల నియోజకవర్గాల్లో ఐవీఆర్ఎస్ సర్వే నిర్వహించిన విషయం తెలిసిందే.

గురజాల సెంటిమెంట్ నేపథ్యంలో..

ఎన్నికలకు ముందు, అభ్యర్థుల ప్రకటన తర్వాత నిర్వహిస్తున్న రా.. కదలి రా సభతో పల్నాడులో యరపతినేని శ్రీనివాసరావు జనజాతరకు తెరలేపారు. హఠాత్తుగా ఖరాయిన ఈ కార్యక్రమంలో భారీ చేరికలు ఉండనున్నట్లు తెలుస్తోంది. ఈ సభ మొత్తం పల్నాడు జిల్లా ఎన్నికల వాతావరణాన్ని ప్రభావితం చేసే అవకాశం ఉంది. చంద్రబాబుకి పల్నాడులో గురజాల సెంటిమెంట్ బలంగా ఉంది. అందుకు తగ్గట్టుగా రా కదలిరా సభకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికలకు ముందు ఇక్కడ నుంచి కార్యక్రమం ఆరంభిస్తే విజయం తథ్యమన్న ఆలోచన ఉంది. 2014లో కూడా గురజాల నియోజకవర్గం పొందుగల నుంచే చంద్రబాబు ఎన్నికల శంఖారావం పూరించి గద్దెనెక్కారు. ఆ ఎన్నికల్లో నరసరావుపేట లోక్‌సభ పరిధిలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో టీడీపీ విజయకేతనం ఎగుర వేసింది. ఇప్పుడు కూడా పూర్వపు వైభవం దిశగా అడుగులు వేసేందుకు గురజాలలో సభ ఏర్పాటు చేశారు. 2019 ఎన్నికల తర్వాత మారిన రాజకీయ పరిణామాలతో పల్నాడులో టీడీపీ క్యాడర్ తీవ్రఒత్తిడికి గురౌతుంది. ఈ పరిస్థితుల్లో రా కదలిరా సభ క్యాడర్‌కు వెన్నుదన్నుకానుంది. మాచర్ల, గురజాల నియోజకవర్గాల్లో దాడులు, హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తున్న వైసీపీ నేతలకు చంద్రబాబు ఈ సభ సాక్షిగా నేరుగా వార్నింగ్ ఇవ్వనున్నారు. క్యాడర్‌ను ఎన్నికలకు సర్వసన్నద్ధం చేసేందుకు ఈ పర్యటన ఉపకరిస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. లక్ష మందితో సభను నిర్వహించి తద్వారా ప్రత్యర్థుల శిబిరాన్ని మానసికంగా దెబ్బతీసేందుకు యరపతినేని పావులు కదుపుతున్నారు. గ్రామాలను ప్రభావితం చేయడంతో పాటు, ఎన్నికల గెలుపు ఓటమిని ప్రభావితం చేయగలిగిన నేతలు చంద్రబాబు సమక్షంలో తిరిగి పార్టీలోకి రానున్నట్లు తెలుస్తోంది.

చారిత్రాత్మకంగా సభ : యరపతినేని

గురజాలలో రా.. కదలిరా మరో చారిత్రాత్మక సభగా మిగిలిపోనున్నదని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. దాచేపల్లి సమీపంలో జరుగుతున్న బహిరంగ సభ ఏర్పాట్లను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2013 సెప్టెంబరులో ఆత్మగౌరవయాత్ర స్ఫూర్తితో రా.. కదలిరా సభ విజయవంతం చేస్తామన్నారు. ఇప్పటిదాకా రాష్ట్రంలో జరిగిన రా.. కదలిరా సభలకన్నా గురజాల సభ భారీగా నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు సన్నద్ధమవ్వాలని కోరారు. లక్ష మందితో సభను విజయవంతం చేసేందుకు కార్యకర్తలు, నాయకులు కదలి రావాలని పిలుపునిచ్చారు. నరసరావుపేట వైసీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుతో పాటు మరికొంతమంది ముఖ్యనేతలు కూడా ఈ సభలో చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరనున్నట్లు తెలిపారు.



రేపు టీడీపీలో చేరుతున్నా : ఎంపీ లావు


దాచేపల్లిలో జరిగే రా.. కదలిరా సభలో చంద్రబాబు సమక్షంలో పార్టీలో చేరుతున్నట్లు వైసీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు గురువారం తెలిపారు. ఈ కార్యక్రమానికి అభిమానులు తరలిరావాలని పిలుపిచ్చారు. ప్రజా సంక్షేమం, పల్నాడు అభివృద్ధికి కట్టుబడి మరలా నరసరావుపేట లోక్‌సభ స్థానానికి టీడీపీ అభ్యర్థిగా తాను పోటీ చేయనున్నట్లు ప్రకటించారు. అన్ని వర్గాల ప్రజలను కలుపుకుంటూ, అభివృద్ధి సాధించేందుకే తన ప్రతి అడుగు, ఆలోచన ఉంటుందన్నారు. ఎంపీగా ఈ ఐదేళ్లలో సాధించుకున్న ప్రగతి పనులను పూర్తి చేసుకోవడంతో పాటుగా రానున్న కాలంలో మరిన్ని కార్యక్రమాలు సాధించుకునేందుకు ప్రజలు మళ్లీ తనను ఆశీర్వదించాలని కోరారు.



తిరునాళ్లకు.. సాగర్ జలాలు

- నేడు సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకు నీటి విడుదల

నరసరావుపేట, ఫిబ్రవరి 29: కోటప్పకొండ తిరునాళ్లలో నీటి వెతలు తీరనున్నాయి. తిరునాళ్ల కోసం సాగర్ నీటిని సరఫరా చేయనున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం సాగర్ నుంచి కుడికాలువకు నీటిని విడుదల చేస్తారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు కేఆర్ఎంబీ చేస్తోంది. మూడు టీఎంసీల నీటిని వినియోగించుకునేందుకు కేఆర్ఎంబీ అనుమతి ఇచ్చిందని జలవనరుల శాఖ ఎస్సీ వరలక్ష్మి గురువారం తెలిపారు. ఈ నీటిని తాగునీటి చెరువులు నింపేందుకు, కోటప్పకొండ తిరునాళ్లకు వచ్చే భక్తుల అవసరాలకు వినియోగించడం జరుగుతుందన్నారు. కుడికాలువ నుంచి గుంటూరు బ్రాంచ్ కెనాల్‌కు నీటి సరఫరా చేస్తామన్నారు. జీబీసీ నుంచి చిలకలూరిపేట మేజర్‌కు నీటిని సరఫరా చేయనున్నట్లు చెప్పారు. నరసరావుపేట, చిలకలూరిపేట మునిసిపాల్టీ చెరువులను నింపుకొనేందుకు నీటిని వినియోగించు కోవాలన్నారు. తిరునాళ్లకు వచ్చే భక్తులు పుణ్యస్నానాలకు చిలకలూరిపేట మేజర్‌లో నీరు ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. కోటప్పకొండ దిగువన ఉన్న చెరువులను నింపుకొనేలా ఆర్‌డబ్ల్యూఎస్ ఏర్పాట్లు చేయాల్సి ఉంది.



సాగర్ కుడికాలువ

పది విద్యార్థుల కోసం ఫోన్లు

- పరీక్షలు ప్రారంభం కాకున్నా రంగంలోకి
- తల్లిదండ్రులకు జూనియర్ కళాశాలల నుంచి కాల్స్
- మీ అబ్బాయి/అమ్మాయిని చేర్పించమని డబ్బా కొట్టుడు
- ఇప్పుడు సీటు కన్‌ఫర్మ్ చేసుకుంటే ఫీజు రాయితీ అని బేరసారాలు
- అసలు తమ నెంబర్లు వారి చేతికి ఎలా వెళ్లాయని తల్లిదండ్రుల ఆవేదన



గుంటూరు, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులకు ఇంకా పరీక్షలే ప్రారంభం కాలేదు. అయినప్పటికీ కొన్ని జూనియర్ కళాశాలల యాజమాన్యాలు ఇప్పటి నుంచే విద్యార్థులకు గాలం వేసి పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. గత కొన్ని రోజుల నుంచి అదే పనిగా రిసెప్షనిస్టుల ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్లు చేయిస్తూ మా కాలేజ్‌లో చేర్పించమని ఏవేవో చెబుతూ వల విసురుతున్నాయి. మార్చి 18 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభమవుతాయి. అంటే ఏప్రిల్ మొదటి వారం వరకు పదో తరగతి విద్యార్థులు పరీక్షల హడావుడిలో ఉంటారు. ఆయా పరీక్షలకు సంబంధించి విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఆ హడావుడిలో ఉంటారు. అయితే ఇంకా పరీక్షలు ప్రారంభం కాకున్నా ఫిబ్రవరి చివరి వారం నుంచి జూనియర్ కళాశాలల యాజమాన్యాలు అడ్మిషన్లపై దృష్టి సారించాయి. ఆలస్యమైతే ఎక్కడ విద్యార్థులు చేజారి పోతారేమోనని ఆత్రుత పడుతున్నాయి. దీంతో వివిధ పాఠశాలల నుంచి పదో తరగతి విద్యార్థుల వివరాలు సేకరించాయి. ఆ ప్రకారం వారి తల్లిదండ్రులకు ఫోన్లు చేసి పిల్లల్ని తమ కళాశాలలోనే చేర్పించాలని అభ్యర్థిస్తున్నారు. తమ కళాశాల మిగిలిన కళాశాలల కంటే గొప్ప అని ఐఐటీ, నీట్ సీట్లు సాధించామంటూ ప్రచారం చేసుకుంటున్నారు. ఇప్పుడే సీటు కన్‌ఫర్మ్ చేసుకుంటే ఫీజులో రాయితీ ఉంటుందని, పరీక్షలు/ఫలితాల తర్వాత అయితే మొత్తం ఫీజు చెల్లించాల్సి ఉంటుందని బేరసారాలు చేస్తున్నారు. కొన్ని కళాశాలలు అయితే ఎంట్రన్స్ టెస్టు రాసేందుకు తీసుకురావాలని కోరుతున్నాయి. చాలా పాఠశాలలకు అనుబంధ కళాశాలలు కూడా ఉండటంతో వాటి యాజమాన్యాలు ఎలాగైనా తమ విద్యార్థులను బయటకు పోకుండా చేసేందుకు వివిధ రీతుల్లో ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇతర కళాశాలలకు పోతారేమోనని తమ వద్ద చదువుతున్న పదో తరగతి విద్యార్థులకి ఆదివారం కూడా సెలవు ఇవ్వకుండా ఉదయం నుంచి సాయంత్రం వరకు తరగతులు నిర్వహిస్తూ జాగ్రత్త పడుతున్నాయి.

అడ్వాన్స్ అడ్మిషన్లు..

కొన్ని కళాశాలలు అడ్వాన్స్ అడ్మిషన్లు కూడా చేపట్టాయి. ఇప్పటికే కొంతమంది విద్యార్థులను చేర్చుకుని వారి తల్లిదండ్రుల వద్ద అడ్వాన్స్ ఫీజులు కూడా జమచేసుకున్నాయి. 10వ తరగతి పరీక్షలు అయిపోయిన కొద్ది రోజులకే ఆన్‌లైన్ క్లాస్‌లు కూడా ప్రారంభిస్తామని సమాచారం ఇస్తున్నాయి. కాగా తమ ఫోన్ నెంబరు డేటా లీక్ చేయడంపై విద్యార్థుల తల్లిదండ్రులు జిల్లా విద్యా శాఖ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వారి కమీషన్ల కోసం తమ పర్సనల్ నెంబర్లు ఇవ్వడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. దీనిపై తగిన విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

విద్యా శాఖ నుంచి వివరాలు లీకు

పదో తరగతి విద్యార్థులకు సంబంధించిన డేటా విద్యా శాఖ వద్దనే ఉంటుంది. పరీక్షల కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడు ఆధార్, తల్లిదండ్రుల ఫోన్ నెంబర్లను కూడా అందులో నింపించారు. ఇప్పుడు ఆ డేటా ప్రైవేటు జూనియర్ కళాశాలలకు చేరిందంటే కచ్చితంగా లీకు వీరులు విద్యాశాఖలోనే ఉన్నారని స్పష్టమౌతున్నది. ఇందుకోసం ఆయా కళాశాలల నుంచి అమ్యామ్యాలు ముట్టినట్లు సమాచారం. విద్యార్థుల డేటా ప్రైవేటు జూనియర్ కళాశాలల చేతికి చిక్కడంతో వారి తల్లిదండ్రులకు నిత్యం మూడు నుంచి ఐదు కళాశాలల రిసెప్షనిస్టులు ఫోన్లు చేస్తున్నారు. పరీక్ష రాయబోతున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఈ విధమైన ఫోన్‌కాల్స్‌తో తీవ్ర అసౌకర్యానికి గురౌతున్నారు. ఒకసారి వచ్చిన ఫోన్ నెంబర్‌ని బ్లాక్ చేసినా వేరే నెంబర్ల నుంచి ఫోన్లు చేసి పీడిస్తున్నారు.

7లో..

న్యాయం అడిగితే కేసులతో వేధింపులు

- 1535వ రోజుకు చేరిన రైతుల ఆందోళనలు

7న వేమూరులో చంద్రబాబు పర్యటన

- టీడీపీ, జనసేన శ్రేణులు సమన్వయంతో పని చేయాలి
- మాజీ మంత్రి ఆనందబాబు

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- ఒత్తిడి తగ్గించేందుకు బ్రీతింగ్ ఎక్సర్‌సైజ్‌లు
- ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదు
- ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ బోర్డు అధికారి నీలావతిదేవి

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 29: జిల్లావ్యాప్తంగా శుక్రవారం నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు జరగనున్నాయి. ఆయా పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ బోర్డు అధికారి ఎం నీలావతిదేవి తెలిపారు. నరసరావుపేటలోని జిల్లా ఇంటర్మీడియట్ బోర్డు ఎడ్యుకేషన్ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో పరీక్షలకు సంబంధించిన వివరాలను ఆమె తెలిపారు. శుక్రవారం నుంచి మార్చి 20వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయని చెప్పారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ఉదయం 8.30 గంటల నుంచి పరీక్షా కేంద్రంలోకి విద్యార్థులను అనుమతిస్తామని చెప్పారు. తొమ్మిది గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించమన్నారు. విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి తగ్గించేందుకు ప్రతీ కేంద్రంలో పరీక్ష ప్రారంభానికి ముందు విద్యార్థులతో మొదటి రెండు నిమిషాలు బ్రీతింగ్ ఎక్సర్‌సైజ్‌లు చేయిస్తారన్నారు. విద్యార్థులు హాల్‌టిక్కెట్ తప్పించి సెల్‌ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురాకూడదన్నారు. జిల్లా వ్యాప్తంగా 48 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. నరసరావుపేటలో 15, సత్తెనపల్లిలో 6, వినుకొండలో 4, చిలకలూరిపేటలో 6, మాచర్లలో 3, గురజాలలో 2, పిడుగురాళ్లలో 4, అచ్చంపేట, ధరణికోట, 75 తాళ్లూరు, నాగార్జునసాగర్, దుర్గి, దాచేపల్లి, కారంపూడి, బెల్లంకొండలో ఒక్కొక్క కేంద్రంలో పరీక్షలు జరుగుతాయన్నారు. ఈ ఏడాది కొత్తగా ధరణికోట, 75 తాళ్ళూరు, కారంపూడి, చిలకలూరిపేటలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 31,088 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు. వీరిలో మొదటి సంవత్సరం జనరల్ విద్యార్థులు 14,232 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 12,597 మంది, ప్రైవేట్ విద్యార్థులు 2799 మంది, ఒకేషనల్ మొదటి సంవత్సరం విద్యార్థులు 760 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 561 మంది, ప్రైవేట్ విద్యార్థులు 139 మంది ఉన్నారని చెప్పారు. ప్రతీ కేంద్రంలో సీసీ కెమేరాలు ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో ప్రత్యేక అధికారి టీ శేఖర్ బాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇంటర్మీడియట్ బోర్డు అధికారి ఎం నీలావతిదేవి, ప్రత్యేక అధికారి టీ శేఖర్‌బాబు తదితరులు

నిధులు.. దుబారా

- అధికార పార్టీ నేతలకు అధికారులు దాసోహం
- నిబంధనలకు విరుద్ధంగా కట్టడాలు
- రూ.30 లక్షల నిధులతో కల్వర్టు నిర్మాణం



వినుకొండ రోడ్డు బస్టాండ్ సమీపంలో నిర్మిస్తున్న కల్వర్టు

నరసరావుపేట, ఫిబ్రవరి 29: మునిసిపల్ ఇంజనీరింగ్ విభాగం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోంది. అధి కార పార్టీకి దాసోహమైంది. ఆ పార్టీ నేతల ప్ర యోజనాల కోసం కష్టపడి పనిచేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా మునిసిపాల్టీ నిధుల ను వెచ్చిస్తున్నారు. రూ.లక్షలు దుబారా చేస్తున్నారు. నిధుల వినియోగంపై మునిసిపల్ ప్రత్యేక అధికారి, ఆర్డీవో పర్యవేక్షణ కొరవడింది. ప్రత్యేకఅధికారి ఫైళ్లపై సంతకాలకే పరిమితమయ్యారన్న విమర్శలున్నాయి. తాజాగా అధికారపార్టీ నేతల ప్రయోజనాల కోసం రూ.30లక్షలు మునిసిపాల్టీ నిధులను దుబారా చేస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారపార్టీ నేతలు ఆర్టీసీ స్థలం లీజుకు తీసుకొని వ్యాపార సముదాయ నిర్మాణం చేపడుతున్నారు. దీనికోసం మునిసిపాల్టీ రూ.30లక్షల వ్యయంతో కల్వర్టు నిర్మాణాన్ని చేపట్టింది. కల్వర్టు అవసరమైతే సదరు నేతలు నిర్మించుకోవాలి. వారు అడిగిన వెంటనే కల్వర్టు నిర్మాణాన్ని మునిసిపాల్టీ చేపట్టింది. మునిసిపల్ కౌన్సిల్ లేకపోవడంతో నిధులు వినియోగం ఇష్టారాజ్యంగా జరుగుతోంది. గతంలో కూడా పోలీసు కార్యాలయానికి సంబంధించిన పనులు కూడా చేశారు. పల్నాడు రోడ్డులో ఓ బార్ కోసం మురుగు కాలువ నిర్మించారు. పల్నాడు రోడ్డులో మునిసిపాల్టీకి సంబంధించిన డివైడర్‌ను తొలగిస్తే సదరు అధికారపార్టీ నేతపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఆయన పంచన చేరారు. మునిసిపల్ అధికారులు నిబంధనలు తుంగలో తొక్కి తమను అడిగేవారెవరన్న రీతిలో వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇంజనీరింగ్ విభాగం అసలు నిబంధనలను పాటించడమే మానేసిందన్న ఆరోపణలున్నాయి. అధికారపార్టీ నేతల కోసం మునిసిపాల్టీ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తుండటం గమనార్హం. కాగా మునిసిపాల్టీ యంత్రాలు కూడా అధికారపార్టీ నేతల రియల్ వెంచర్ పనుల్లో వినియోగించుకుంటున్నారు.

నిధులు స్వాహా కూడా..

నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేపట్టి మునిసిపాల్టీ నిధులు దుబారా చేయడం ఒక ఎత్తైతే.. నిధుల స్వాహా కూడా జరుగుతున్నట్టు సమాచారం. నిర్మాణానికి రూపొందించిన వ్యయంలో కూడా అక్రమాలు ఉన్నట్టు ఇంజనీరింగ్ నిపుణులు చెబుతున్నారు. రూ.10లక్షల నుంచి రూ.15లక్షల లోపు ఖర్చయ్యే నిర్మాణానికి రూ.30లక్షలు వెచ్చిస్తున్నట్టు అధికారులు వెల్లడించడం వెనుక స్వాహా పర్వం ఉందని వారు అభిప్రాయపడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణంపై ఉన్నతాధికారులు స్పందిస్తారో, వారు కూడా అక్రమార్కుల పంచన చేరిపోతారో చూడాలి. కనీసం నిర్మాణానికి వెచ్చిస్తున్న నిధులపై కూడా చర్యలు తీసుకోవాల్సి ఉంది. కంచే చేను మేసిన చందాన మునిసిపాల్టీలో అధికారుల పనితీరు ఉందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నా తమను అడిగేవారు ఎవరు? అధికార పార్టీ తమకు అండగా ఉందన్న ధీమాను అధికారులు వ్యక్తం చేస్తున్నారన్న విమర్శలున్నాయి.

అరుదైన సినిమా అవుతుంది



"గామి' అరుదైన సినిమా. ఆరేళ్లపాటు అంకితభావంతో తెరకెక్కించడం మామూలు విషయం కాదు. సినిమాపై ఎంతో ప్రేమ ఉంటే తప్ప ఇది సాధ్యం కాదు' అని దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా అన్నారు. విష్వక్‌సేన్ కథానాయకుడిగా విద్యాధర్ కాగిత దర్శకత్వం వహించిన 'గామి' చిత్రం ట్రైలర్‌ను సందీప్‌రెడ్డి వంగా విడుదల చేశారు. విష్వక్‌సేన్ మాట్లాడుతూ 'ఇది రెగ్యులర్ చిత్రం కాదు. మాస్ అంశాలు ఉండవు. అయినా 'గామి' ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంటుంది. తెలుగు పరిశ్రమ గర్వపడే సినిమా అవుతుంది' అన్నారు. సినిమా చూస్తున్నంతసేపు తర్వాత ఏం జరగబోతోందో అనే ఉత్సుకత ప్రేక్షకుల్లో కలుగుతుందని విద్యాధర్ తెలిపారు. ఈ సినిమాకు పనిచేసినవారికీ, సాయం చేసిన వారికి నిర్మాత శబరీషన్ ధన్యవాదాలు తెలిపారు.

అరి అన్వేషణ



వినోద్‌వర్మ, సూర్య పురిమెట్ల, అనసూయ భరద్వాజ్, సాయికుమార్ ప్రధాన తారాగణంగా రూపొందిన చిత్రం 'అరి'. 'పేపర్‌బాయ్' ఫేం జయశంకర్ దర్శకుడు. శ్రీనివాస్ రామిరెడ్డి, తిమ్మప్ప నాయుడు పురిమెట్ల, శేషు మారంరెడ్డి నిర్మిస్తున్నారు. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రం నుంచి వినోద్ వర్మ క్యారెక్టర్ ఫస్ట్‌లుక్‌ను చిత్రబృందం విడుదల చేసింది. గ్రంథాలయంలో తీక్షణంగా శోధిస్తున్న లుక్‌లో ఆయన కనిపించారు. ఈ చిత్రానికి సంగీతం: అనూప్ రూబెన్స్, సినిమాటోగ్రఫీ: కృష్ణ ప్రసాద్


శ్రీవిష్ణు డబుల్ ధమాకా



గురువారం హీరో శ్రీవిష్ణు పుట్టిన రోజు. ఈ సందర్భంగా ఆయన కథానాయకుడిగా రెండు కొత్త చిత్రాలను నిర్మాణ సంస్థలు ప్రకటించాయి. గీతా ఆర్ట్స్, కళ్యా ఫిల్మ్స్ సంయుక్తంగా కార్తిక్‌రాజు దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. అల్లు అరవింద్ సమర్పకులు. 'ఎస్ వీ 18' వర్కింగ్ టైటిల్. వినూత్నమైన ప్రేమకథా చిత్రమిదని నిర్మాణ సంస్థలు పేర్కొన్నాయి. అలాగే హసిత్ గోలీ దర్శకత్వంలో శ్రీ విష్ణు హీరోగా నటిస్తున్న చిత్రానికి 'శ్వాగ్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. టీజీ విశ్వ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి వివేక్ సాగర్ సంగీతం అందిస్తున్నారు. ఇతర వివరాలను మేకర్స్ త్వరలో వెల్లడించనున్నారు.

మనసు నొచ్చుకుంటే మన్నించండి

నాగేంద్రబాబు



వరుణ్‌తేజ్ హీరోగా నటించిన 'ఆపరేషన్ వాలెంటైన్' చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో నాగేంద్రబాబు మాట్లాడుతూ 'ఆరడుగుల మూడంగుళాలు ఉండే హీరోలు పోలీసు పాత్రలు చేస్తే బావుంటుంది. ఐదడుగుల మూడంగుళాలు ఉండే హీరోలయితే చూడ్డానికి ఎబ్బెట్టుగా ఉంటుంద'ని వ్యాఖ్యానించారు. దీనిపై పలువురు టాలీవుడ్ హీరోల అభిమానులు సోషల్ మీడియాలో నాగబాబు తీరును తప్పుపట్టారు. దీంతో సోషల్ మీడియా వేదికగా నాగేంద్రబాబు స్పందించారు. 'ఎవరినో తక్కువ చేయాలని అలా మాట్లాడలేదు, నా మాటల వల్ల ఎవరి మనసునైనా నొప్పించి ఉంటే క్షమించండి' అని కోరారు.

ముచ్చటగా మూడోసారి



నిర్మాత శివలెంక కృష్ణ ప్రసాద్, దర్శకుడు ఇంద్రగంటి మోహన్ కృష్ణ ముచ్చటగా మూడోసారి ఓ సినిమాను పట్టాలెక్కించనున్నారు. ఇంకా టైటిల్ ఖరారు కాని ఈ చిత్రంలో కథానాయకుడిగా ప్రియదర్శి నటించనున్నారు. మార్చి నెలాఖరు నుంచి ఈ చిత్రం షూటింగ్‌ను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. సూపర్ హిట్ కాంబోగా పేరున్న వీరిద్దరి నుంచి గతంలో వచ్చిన రెండు చిత్రాలూ విశేష ప్రేక్షకాదరణను పొందాయి. దీంతో ఈ మూడవ చిత్రంపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి వీరిద్దరి కలయికలో వచ్చిన మొదటి చిత్రం 'జెంటిల్‌మేన్' 2016లో విడుదలై భారీ విజయాన్ని కైవసం చేసుకుంది. ఈ సినిమాలో నాని, నివేథా థామస్, సురభి నటించారు. ఆ తర్వాత 2017లో వచ్చిన మరో సూపర్ హిట్ చిత్రం 'సమ్మోహనం' ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. ఇందులో సుధీర్ బాబు, అదితి రావు హైదరీ ప్రధాన పాత్రలు పోషించారు.

తల్లి కాబోతున్న దీపికా పదుకొణె



బాలీవుడ్ బెస్ట్ కపుల్స్‌లో ఒకరిగా పేరొందిన దీపికా పదుకొణె, రణ్‌వీర్ సింగ్ జంట అభిమానులకు తీపి కబురందించారు. త్వరలోనే తల్లిదండ్రులు కాబోతున్నామని ఇన్‌స్టాగ్రామ్ వేదికగా గురువారం ఆనందం వ్యక్తం చేశారు. డాక్టర్లు, సెప్టెంబర్‌లో డెలివరీ డేట్ ఇచ్చారని ఆ పోస్టులో పేర్కొన్నారు. 2013లో రణ్‌వీర్, దీపికా 'రామ్‌లీలా'లో కలిసి నటించారు. ఆ సినిమా షూటింగ్ సమయంలో ఇరువురూ ప్రేమలో పడ్డారు. ఆ తర్వాత 2018లో వీరిద్దరూ ఇటలీలో ఘనంగా డెస్టినేషన్ వెడ్డింగ్ చేసుకున్నారు.

మంచి సినిమాతో వస్తున్నాం

శివ కందుకూరి



శివ కందుకూరి హీరోగా రూపొందిన యూనిక్ క్రైమ్ థ్రిల్లర్ 'భూతద్దం భాస్కర నారాయణ' నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా హీరో శివ గురువారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ 'క్రైమ్, డిటెక్టివ్ థ్రిల్లర్స్ తెలుగులో చాలా వచ్చాయి. అందుకే ఏదో కొత్తదనం ఉంటే తప్ప అలాంటి సినిమా చేయకూడదని అనుకున్నాను. 'భూతద్దం భాస్కర నారాయణ' చిత్ర కథ విన్నాక కొత్తగా అనిపించింది. ఎందుకంటే ఇందులో మైథాలజీ ఎలిమెంట్ కూడా ఉంది. దిష్టి బొమ్మ చూస్తుంటాం. కానీ అసలు ఎందుకది అనే విషయాన్ని పట్టించుకోం. దీని గురించి పురాణాల్లో ఒక కథ ఉంది. ఆ కథకు క్రైమ్, డిటెక్షన్ అంశాలు జోడించాం. కచ్చితంగా ఓ మంచి సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాం. మా చిత్రాన్ని గీతా ఆర్ట్స్ సంస్థ విడుదల చేస్తుండడం మరింత బలాన్ని ఇచ్చింది' అని చెప్పారు.

కొత్త కాన్సెప్ట్‌తో... ఎస్ 99



సి.జగన్ మోహన్ దర్శకత్వంలో యతీష్, నందిని నిర్మించిన 'ఎస్ 99' చిత్రం ప్రీ రిలీజ్ వేడుక ఇటీవలే నిర్వహించారు. ప్రేక్షకులకు సరికొత్త ఎక్స్‌పీరియన్స్ అందివ్వాలనే ఉద్దేశంతో విలక్షణ సబ్జెక్ట్‌ను ఎంచుకున్నామని దర్శకుడు తెలిపారు. ఇది విజువల్స్, సౌండ్ ప్రధానంగా సాగే కాన్సెప్ట్ బేస్డ్ చిత్రమన్నారు. ఎటువంటి నేరచరిత్ర లేని ఒక వ్యక్తి క్రైమ్‌కు పాల్పడితే ఎలా ఉంటుందో ఆసక్తికరంగా చూపించడమే కథాంశమని వివరించారు. సినిమాకు టీం స్పిరిట్ ప్రధానమని, ఈ విషయంలో మాకు మంచి టీం దొరికిందని నిర్మాత యతీష్ సంతోషం వ్యక్తం చేశారు.

జానపద, సినీగాయకుడు వడ్డేపల్లి శ్రీనివాస్ కన్నుమూత



ప్రముఖ జానపద, సినీ గాయకుడు వడ్డేపల్లి శ్రీనివాస్(64) గురువారం ఉదయం సికింద్రాబాద్ సీతాఫల్‌మండి శ్రీనివాస్‌నగర్‌లోని తన స్వగృహంలో మృతిచెందారు. ఆయనకు భార్య ఇందిర, కుమార్తె మానస ఉన్నారు. ఇప్పటి వరకు సుమారు 14వేల ప్రదర్శనలను ఇచ్చిన శ్రీనివాస్ తొలిసారిగా 'నమస్తే అన్న' చిత్రంలో 'గరం... గరం... పోరీ... నా గజ్జెల సవారీ' పాట పాడారు. ఆ తర్వాత నాగార్జున 'కింగ్' సినిమాలో 'గింత, గింత బాల చుక్కవే' పాట పాడారు. పవన్‌కల్యాణ్ నటించిన 'గబ్బర్‌సింగ్' చిత్రంలో శ్రీనివాస్ పాడిన 'గన్ను లాంటి కన్నులున్న...' పాట ఎంతో హిట్ అయ్యింది. ఈ పాటకు 2012 సంవత్సరంలో ఉత్తమగాయకుడిగా ఫిల్మ్ ఫేర్ అవార్డు అందుకున్నారు. గురువారం సాయంత్రం వడ్డేపల్లి శ్రీనివాస్ అంత్యక్రియలు సీతాఫల్‌మండి శశ్మానవాటికలో జరిగాయి.

బౌద్ధనగర్ (ఆంధ్రజ్యోతి)



వెంకటపాలెం శిబిరంలో నినాదాలు చేస్తున్న రైతులు, మహిళలు

న్యాయం అడిగితే కేసులతో వేధింపులు

- 1535వ రోజుకు చేరిన రైతుల ఆందోళనలు

తుళ్లూరు, ఫిబ్రవరి 29: రాజధాని అమరావతికి జీవనాధారమైన మూడు పంటలు పండే భూమినిచ్చిన తమపై అక్రమ కేసులు పెడతారా అంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు గురువారం నాటికి 1535వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి పలువురు రైతులు మాట్లాడుతూ, న్యాయం జరిగేంతవరకు ఉద్యమం ఆపేది లేదన్నారు. అక్రమ కేసులకు భయపడం.. వెనక్కి తగ్గమన్నారు. ఐదు కోట్లమంది రాజధాని అమరావతి కావాలని కోరుకుంటుంటే మంత్రులు విశాఖలో రహస్యంగా కార్యాలయాలు ప్రారంభిస్తుండటం సిగ్గుచేటన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమంలో దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేశారు. రాజధాని 29గ్రామాల్లో ఆందోళనలు కొనసాగాయి.

భార్య హత్య కేసులో జీవిత ఖైదు

గురజాల లీగల్, ఫిబ్రవరి 29: భార్యను హత్య చేసిన భర్తకు కోర్టు జీవిత ఖైదు విధించింది. వివరాల్లోకి వెళితే.. మాచవరం మండలం మోర్జంపాడు గ్రామానికి చెందిన ఎస్‌కే నాగుర్ కూలీపనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. అతనికి మాచర్ల పట్టణానికి చెందిన లాలు కుమార్తె మస్తాన్‌బీతో వివాహం జరిగింది. భార్యతో తరచూ గొడవ పెట్టుకుంటూ కొడుతుండే వాడు. జూలై 13, 2017న మధ్యాహ్న సమయంలో మస్తాన్‌బిని పలుగుతో పొడిచి హత్య చేశాడు. అత్తమామల ఫిర్యాదుతో కేసునమోదు కాగా నేరం రుజువు కావడంతో ముద్దాయికి జీవితఖైదు, రూ.1000 జరిమానా విధిస్తూ గురజాల 10వ అదనపు జిల్లాకోర్టు న్యాయాధికారి జి.వెంకటేశ్వర్లు తీర్పు వెల్లడించారు.

పురుగుమందు తాగి రైతు ఆత్మహత్య

వెల్దుర్తి, ఫిబ్రవరి 29: అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని మండాదిలో జరిగింది. గ్రామానికి చెందిన మూలంరెడ్డి శ్రీనివాసరెడ్డి (50) మూడేళ్లుగా తనకున్న రెండెకరాలతో పాటు మరో మూడు ఎకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేశాడు. అననుకూల పరిస్థితులతో రూ.10 లక్షల దాకా అప్పుల పాలయ్యాడు. అప్పులు తీర్చే మార్గం కనపడక మనస్థాపం చెంది బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మృతునికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు.

7న వేమూరులో చంద్రబాబు పర్యటన



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆనందబాబు

- ప్రజాస్వామ్య విలువలను కాలరాసే జగన్‌కు బుద్ధి చెప్పాలి
- టీడీపీ, జనసేన శ్రేణులు సమన్వయంతో పని చేయాలి
- మాజీ మంత్రి ఆనందబాబు

వేమూరు, ఫిబ్రవరి 29: వేమూరు నియోజకవర్గంలో ఈనెల 7న టీడీపీ అధినేత, మాజీ సీఎం నారా చంద్రబాబునాయుడు పర్యటిస్తారని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు నక్కా ఆనందబాబు తెలిపారు. గురువారం సాయంత్రం నియోజకవర్గ కేంద్రమైన వేమూరు ఎన్టీఆర్ పురవేదికవద్ద వేమూరు మండల టీడీపీ, జనసేన శ్రేణుల సమన్వయ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన ఆనందబాబు మాట్లాడుతూ చంద్రబాబు పర్యటనను నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన శ్రేణులు విజయ వంతం చేయాలన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య విలువలను కాలరాసి అధికార దాహంతో పాలన కొనసాగిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డికి బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయని, అందుకు టీడీపీ, జనసేన శ్రేణులు సంసిద్ధగా ఉండాలని మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. గురువారం రెండు పార్టీలతో ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయమన్న ఆకాంక్షను వ్యక్తపరిచారు. గెలుపు దిశగా సమన్వయంతో ముందుకు నడవాలని పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఐదు సంవత్సరాల కాలంలో రాష్ట్రాన్ని, రాష్ట్ర ప్రజలను నయవంచనతో పాలించిన జగన్‌కు విలువైన ఓటు ద్వారా చావు దెబ్బకొట్టాలని పిలుపునిచ్చారు. గ్రామ గ్రామాన వార్డుల వారీగా సంయుక్త సమావేశాలు ఏర్పాటు చేసి ఓటర్లను చైతన్య పరచాలన్నారు. ప్రజా సంక్షేమంతో పాటు అభివృద్ధిని కూడా ముందుకు నడిపే విధంగా చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు ప్రణాళికాబద్ధమైన ఆలోచనలు సాగిస్తున్నారన్నారు. యువత, మహిళలకు ప్రాధాన్యమిస్తూ ప్రకటించిన మేనిఫెస్టో వివరాలను ఇంటింటికి ప్రచారం చేయాలన్నారు. ఎన్నికలకు సమయం ఆసన్నమవుతుందని కేవలం 40 రోజుల వ్యవధిలోనే ఎన్నికలు జరుగుతాయన్నారు. సమావేశంలో బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, మండల పార్టీ అధ్యక్షులు దండే వెంకట సుబ్బారావు, ఘంటా స్వాతి, అమ్మిశెట్టి కిషోర్‌బాబు, శివకృష్ణ, జనసేన నాయకులు అనూరాధ, రాజేష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన కూటమి ప్రభంజనం తథ్యం

- ఎన్నికల ప్రచారం ప్రారంభించిన నరేంద్రకుమార్



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నరేంద్ర కుమార్, జ్యోతిర్మయి దంపతులు

పొన్నూరుటౌన్, ఫిబ్రవరి29: రాష్ట్రంలో టీడీపీ, జనసేన పార్టీల కూటమి ప్రభంజనాన్ని సృష్టించి అధికారంలోకి వస్తుందని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ స్పష్టం చేశారు. మండలంలోని మామిళ్లపల్లి గ్రామంలో గురువారం నరేంద్ర కుమార్, జ్యోతిర్మయి దంపతులు లాంఛనంగా ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. గ్రామంలోని పెద్దింటమ్మ ఆలయం, రామాలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. చర్చిలో ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్, ఎన్టీఆర్, వీరయ్య చౌదరి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ పేరిట ముద్రించిన కరపత్రాలను గ్రామస్తులకు పంచిపెట్టి ఓట్లు అభ్యర్థించారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన సంకీర్ణ కూటమిని ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా నరేంద్ర మాట్లాడుతూ జగన్‌రెడ్డి తనకు ఉన్న అధికారాన్ని అడ్డుపెట్టుకొన్ని రాష్ట్రంలో విధ్వంసం సృష్టించి దోచుకున్నారన్ని ఆరోపించారు. ఇప్పటికే రాష్ట్రంలో పలువురు ఎంపీ అభ్యర్థులు వైసీపీ నుంచి పోటీ చేయకుండా తప్పుకుంటున్నారన్నారు. పొన్నూరు నియోజకవర్గంలో జరుగుతున్న గ్రావెల్ మాఫియా, రేషన్, మద్యం మాఫియా, పేదల భూముల ఆక్రమణలు, వేల కోట్ల దోపిడీపై ఇటీవల పొన్నూరులో జరిగిన సభలో ప్రజాచార్జి షీట్‌ను విడుదల చేసినట్లు చెప్పారు ఈ అక్రమాలను నిలదీయకుండా విచారణ జరపకుండా దోపిడీకి పాల్పడిన కిలారి వెంకట రోశయ్యను జిల్లా స్థాయిలో దోచుకోమని ఎంపీ అభ్యర్థిగా ప్రమోషన్ ఇచ్చారన్ని ఎద్దేవా చేశారు. మహిళలు మంగళహారతులు పట్టి నరేంద్ర కుమార్ దంపతులను తమతో పాటు గ్రామంలోని తీసుకెళ్లారు. ప్రచారం కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు హాజరయ్యారు.

ప్రత్తిపాటి కుమారుడి అరెస్టు అక్రమం

- భగ్గుమన్న టీడీపీ శ్రేణులు
- సీఎం దిష్టిబొమ్మ దహనం



చిలకలూరిపేటలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న టీడీపీ శ్రేణులు

చిలకలూరిపేట, ఫిబ్రవరి 29: మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు కుమారుడు ప్రత్తిపాటి శరత్‌బాబు అక్రమ అరెస్టు పట్ల గురువారం చిలకలూరిపేటలో టీడీపీ శ్రేణులు తీవ్రస్థాయిలో నిరసన వ్యక్తం చేశారు. అరెస్టువార్త తెలిసిన వెంటనే ప్రత్తిపాటి పుల్లారావు నివాసం వద్దనున్న టీడీపీ శ్రేణులు బయటకువచ్చి నిరసన తెలిపారు. భరత్ బాబు అరెస్టును ఖండించారు. సమీపంలోని జాతీయ రహదారిపై బైఠాయించి 'సీఎం జగన్ డౌన్‌డౌన్' అంటూ నినాదాలు చేశారు. జగన్ దిష్టిబొమ్మను దహనంచేశారు. అనంతరం టీడీపీ నాయకులు, కార్యకర్తలు వాహనాల్లో మంగళగిరి వద్దనున్న టీడీపీ కేంద్ర కార్యాలయం వద్దకు తరలి వెళ్ళి పుల్లారావుకు బాసటగా నిలిచారు.

అక్రమ కేసులతో వేధింపులు : పుల్లారావు

రాజకీయ క్షేత్రంలో నేరుగా ఎదుర్కోలేక జగన్ అక్రమ కేసులతో ప్రత్యర్థులపై వేధింపులకు పాల్పడుతున్నారని మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ఆరోపించారు. తన కుమారుడు శరత్ బాబును అన్యాయంగా, అక్రమంగా అరెస్టు చేశారన్నారు. కంపెనీలో డైరెక్టర్‌గా గానీ, కనీసం వాటాదారుడిగా లేని తన కుమారుడిపై జీఎస్టీ ఎగవేతల ఉల్లంఘన కేసులు ఎలా పెడతారంటూ ప్రశ్నించారు. రెవెన్యూ ఇటిలిజెన్స్ అధికారుల ద్వారా బనాయిస్తున్న ఇటువంటి తప్పుడు కేసులకు బెదిరేది లేదని స్పష్టంచేశారు. తన కుమారుడి స్టేట్‌మెంట్ తీసుకోవటం కోసమని పిలిచి అదుపులోకి తీసుకొని అనుకూల మీడియా ద్వారా తప్పుడు సమాచారాన్ని ప్రజలకు చేరవేస్తున్నారని ధ్వజమెత్తారు. తన కుటుంబానికి ఉన్న విశ్వసనీయతను దెబ్బతీయటానికే ఇలా చేస్తున్నారని అన్నారు. అక్రమ కేసులకు భయపడేదే లేదని, వాటిని చట్టపరంగా ధీటుగా ఎదుర్కొంటామని ఆయన వివరించారు. చిలకలూరిపేటలో మంత్రి రజిని వైఫల్యాలే వైసీపీ ఓటమికి బాటలు పరిచాయని చెప్పారు. చిలకలూరిపేట నుంచి తన సీటు నాలుగురోజుల క్రితం పార్టీ ఖరారు చేసిన రోజు సాయంత్రం రెవెన్యూ ఇంటిలిజెన్స్ తమ కుమారుడిపై కేసు నమోదు చేసిందన్నారు. ఎటువంటి ముందస్తు నోటీసులు కూడా ఇవ్వకుండా అదుపులోకి తీసుకున్నారని ఆయన చెప్పారు.



విజయవాడ బందరురోడ్డులోని పోలీసు కమిషనర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న టీడీపీ కార్యకర్తలు, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

నాగులేరుకు కృష్ణా జలాలు..

- పల్నాడు కలెక్టర్ శివశంకర్

దాచేపల్లి, ఫిబ్రవరి 29: దాచేపల్లి మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి ఎద్దడిని తీర్చడం కోసం నాగులేరుకు కృష్ణాజలాలను విడుదల చేస్తామని పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్, గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి తెలిపారు. గురువారం పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్‌తో కలిసి ఎమ్మెల్యే కాసు నాగులేరును పరిశీలించి నీటి ఎద్దడికై ప్రజలు పడుతున్న ఇబ్బందులను కలెక్టర్‌కు వివరించారు. నాగులేరుకు కృష్ణాజలాలను విడుదల చేయడం ద్వారా నాగులేరుకు ఇరువైపులావున్న కారంపూడి, దాచేపల్లి మండలాలకు చెందిన 30కిపైగా గ్రామాలకు తాగునీటి సమస్య పరిష్కార మవుతుందని తెలిపారు. నాగులేరులో చెక్‌డ్యామ్‌లు నిర్మించామని, నీరు నిల్వ ఉండటంతో భూగర్భ జలాలు పెరిగి తాగునీటి సమస్య పరిష్కారమవుతుందని ఎమ్మెల్యే కాసు వివరించారు. కార్యక్రమంలో దాచేపల్లి మునిసిపల్ ఛైర్మన్ కొప్పుల సుబ్బమ్మ, జడ్పీటీసీ మూల గుండ్ల కృష్ణకుమారి, ఎంపీపీ కటకం జయశ్రీ, కోట కృష్ణ, టమాట సుభాని, మందపాటి రమేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దోచుకునేందుకే భూహక్కు చట్టం

- గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీవీ సురేష్



మాట్లాడుతున్న గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్

గుంటూరు(లీగల్),ఫిబ్రవరి29:ప్రజల ఆస్తులను దోచుకునేందుకే రాష్ట్ర ప్రభుత్వం భూమి యాజమాన్య హక్కుల చట్టాన్ని తీసుకొచ్చిం దని గుంటూరుబార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీవీ సురేష్ అన్నారు. గురువారం అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన 2వ రాష్ట్ర స్థాయి సదస్సులో ఆయన మాట్లాడుతూ.. ఈచట్టం ప్రకారం అన్ని రకాల స్థిరాస్తులపై రెవెన్యూ శాఖవారే హక్కులను నిర్ధారిస్తారని, వారి తీర్పులపై అప్పీలును రెవెన్యూశాఖ పరిధిలోని జాయింట్ కలెక్టర్‌కు అప్పజెప్పార న్నారు. వారి తీర్పులపై హైకోర్టుకు వెళ్ళవలసిందేనని, జిల్లా, క్రింది కోర్టులకు ఆ తీర్పులలో జోక్యం చేసుకొనే హక్కు లేద న్నారు. ఈ చట్టం యాజమాన్య హక్కులకు అత్యంత ప్రమాదకర మని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తూ న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించి అనేక రూపాల్లో నిరసన వ్యక్తంచేస్తున్నా ప్రభుత్వం ఈ చట్టాన్ని సమర్థిస్తూ రీ-సర్వే పేరుతో అమలు చేస్తుందని మండిపడ్డారు. మన రాష్ట్రంలోని మొత్తం 149 బార్ అసోషియేషన్ల ప్రతినిధులతో ఒక మహాసభ నిర్వహించి, ఈ చట్టాన్ని రద్దు చేసేవరకు ఉద్యమించాలని బార్ అసోషియేషన్ నిర్ణయించిందన్నారు. అందులో భాగంగా మార్చి 2న ఉదయం 10 నుండి సాయంత్రం 4 వరకు రాష్ట్రంలోని అన్ని బార్ అసోషియేషన్ల ప్రతినిధులతో రాష్ట్ర మహాసభ నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశంలో గుంటూరు బార్ అసోషియేషన్ ఉద్యమ కమిటి సభ్యులు ఎన్. రామ్మోహన్‌రావు, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు ఎస్. బ్రహ్మానంద రెడ్డి, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు చిగురుపాటి రవీంద్రబాబు, కొల్లి శంకరరావు, లావు అంకమ్మ చౌదరి, మాజీ ఏపీపీ కాళీదాసు, సిద్దా సత్యనారాయణ, అసోసియేషన్ కార్యదర్శి వంశీకృష్ణ, నంబూరు పాములు, పీ.రాజారావు తదితరులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.90
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	140, 149,160
చికెన్ విత్ స్కిన్	268.00
చికెన్ స్కిన్ లెస్	278.00

1,30,299 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 1,40,562 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 1,30,229 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 1,06,923 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8500	20500
నెంబరు. 5	13000	18800
273	11000	15000
341	9000	20500
4884	13000	16500
సూపర్ 10	12500	13800
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	21000
బ్యాడిగి	9000	20400
దేవనూరు డీలక్స్	9000	20500
తెల్లకాయలు	5000	12500



విలేకరులతో మాట్లాడుతున్న బ్రహ్మారెడ్డి

అడ్డగోలుగా అధికార దుర్వినియోగం

- ప్రజల రక్తాన్ని తాగుతున్న పిన్నెల్లి సోదరులు
- టీడీపీ-జనసేన మాచర్ల నియోజకవర్గ అభ్యర్థి బ్రహ్మారెడ్డి

మాచర్ల, ఫిబ్రవరి 29: నియోజకవర్గంలో అధికారాన్ని అడ్డగోలుగా వాడుతున్నారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బుధవారం పట్టణంలో జరిగిన ఘర్షణకు సంబంధించి వైసీపీ నేతలు పోలీస్‌శాఖ కళ్లకు గంతలు కడుతున్నారని మండిపడ్డారు. ఘర్షణ సమయంలో కర్రలు ఎక్కడి నుంచి వచ్చాయి.. ఏ షాపు నుంచి తెచ్చారు.. కర్రతలతో వచ్చింది ఎవరు.. టీడీపీ నేతల చేతిలో కర్రలు, కత్తులు, రాడ్లను ఎవరైనా చూశారా అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. అబద్ధాలు చెప్పడం పిన్నెల్లి సోదరులకు పరిపాటిగా మారిందన్నారు. అన్నీ బ్రహ్మారెడ్డిపై నెడుతున్నారని ఎద్దేవా చేశారు. రెంటచింతల మండలం మంచికల్లులో రెచ్చగొట్టింది ఎవరు.. దాడి చేసింది ఎవరు.. అంటూ ప్రశ్నించారు. బురద జల్లడం, దాడులు చేయడం వంటి వాటిపై స్థానిక ఎమ్మెల్యే పథకం రచిస్తున్నారన్నారు. టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలు సంయమనం పాటించాలన్నారు. వైసీపీ నుంచి కార్యకర్తల వలసలు ఎక్కువయ్యాయని, దీన్ని నిరోధించేందుకు గొడవల్లో ఇరికించాలని చూస్తున్నారని అన్నారు. 20 ఏళ్ల క్రితం జరిగిన మర్డర్లు గురించి మాట్లాడుతున్నారని, ఇరువురు ముస్లింలను చంపించిన ఘనత నీది అంటూ ఎమ్మెల్యే పీఆర్కేను ఉద్దేశించి అన్నారు. టీడీపీ నేతలు నిసిగ్గుగా 307 కేసులు పెడుతున్నారన్నారు. బుధవారం పట్టణంలో జరిగిన దాడితో ఎటువంటి సంబంధం లేని కేశవరెడ్డి, గురవారెడ్డి, మురళీలపై కేసులు నమోదు చేశారన్నారు. పోలీస్‌స్టేషన్లో టీడీపీ నేతలు ఫిర్యాదు చేసే పరిస్థితి లేదన్నారు. జెండాచెట్టు వద్ద ఘర్షణలో ఒక వలంటీరు, కౌన్సిలర్ భర్త కర్రలు పట్టుకొని దాడికి దిగారన్నారు. జనసేన నేత బూసా రామాంజనేయులు మాట్లాడుతూ అధికార పార్టీ నేతలకు ఓటమి భయం పట్టుకుందన్నారు. పోలీసు అధికారులు తప్పుడు కేసులు పెట్టడం మానుకోవాలన్నారు. బ్రహ్మారెడ్డి వెంట జనసేన జిల్లా కార్యదర్శి పులి హరి, మండల అధ్యక్షుడు తోటకూర శ్రీనివాసరావు, గుండెబోయిన సాంబశివరావు, గంధం మల్లయ్య, కేసానుపల్లి కృష్ణబాబు, వెంకటరమణ, మదీనా, లాల్ కృష్ణ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న గాదె వెంకటేశ్వరరావు

అధికారం అండతో గెలవాలని కుయుక్తులు

- జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె ధ్వజం

గుంటూరు, ఫిబ్రవరి 29: ఐదేళ్ల పాలనలో ప్రజావిశ్వాసం కోల్పోయిన ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి, వలంటీర్లను అడ్డుపెట్టుకొని అధికార దుర్వినియోగం చేసైనా గెలుపొందేందుకు విఫలయత్నం చేస్తున్నారని జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు మండిపడ్డారు. గురువారం లాడ్జి కూడలిలోని పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వలంటీర్ల వ్యవస్థ అనేది వైసీపీ అధినేత, రూ.కోట్లాది ప్రజాధనంతో ఏర్పాటు చేసుకొన్న సొంత సైన్యమని గాదె ధ్వజమెత్తారు. తెలుగుదేశం, జనసేన పార్టీకి చెందిన ఓటర్లను వలంటీర్ల సహకారంతో ప్రలోభపెట్టి లబ్ధి పొందాలని వైసీపీ ప్రయత్నిస్తోందని ఆయన విమర్శించారు. నిన్న మంళగిరిలో జరిగిన వలంటీర్ల సమావేశంలో 19 విధి విధానాలు కలిగిన నిర్ణయ పత్రాలను వారికి అందజేసిన విషయం నిజం కాదా? అంటూ గాదె నిలదీశారు. ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, గుంటూరు నగరంలో ఉన్న వలంటీర్లతో సమావేశం నిర్వహించి రూ.25 వేల నగదు అందజేశారని ఆయన విమర్శించారు. జగన్‌రెడ్డికి దమ్ము, ధైర్యం ఉంటే వలంటీర్ల వ్యవస్థను రద్దు చేసి ఎన్నికలకు రావాలని ఆయన సవాల్ విసిరారు. వలంటీర్ల వ్యవస్థతో రాజకీయ లబ్ధి పొందాలని జగన్ చేస్తున్న ప్రయత్నాలపై త్వరలో గవర్నర్‌ను కలసి ఫిర్యాదు చేస్తామని జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు తెలిపారు. సమావేశంలో జనసేన నాయకులు యర్రంశెట్టి పద్మావతి, శిఖా బాలు, చట్టాల త్రినాథ్, సిరిగిరి శ్రీనివాస్, చింతా శివ, గోపిశెట్టి సాయి, యర్రంశెట్టి సాయి తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీని మొదటి స్థానంలో నిలపాలి

- గతంలో అవకతవకలపై తలదించుకోవాల్సి వచ్చింది
- సర్వసభ్య సమావేశంలో ఛైర్మన్ రాము

గుంటూరు, ఫిబ్రవరి 29: ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పని చేస్తున్న గుంటూరుజిల్లా కేంద్ర సహకార బ్యాంకును మరింత అభి వృద్ధి పథంలో నడపాలని బ్యాంకు ఛైర్మన్ రాతంశెట్టి సీతారామాంజ నేయులు తెలిపారు. గుంటూరు బ్రాడీపేటలోని బ్యాంకు సమావేశ మందిరంలో గురువారం బ్యాంకు జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈస ందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సహకారశాఖను మరింత బలోపేతం చేశార న్నారు. త్వరలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఇటీవల జరిగిన ఓ సదస్సులో సొసైటీలో జరిగిన అక్రమాలపై తల దించుకోవాల్సి వచ్చిందని రాము ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంకులో జరిగే అక్రమాలపై తాము చర్యలు తీసుకోవచ్చు కానీ సొసైటీలో జరిగే అక్రమాలపై చర్యలు తీసుకునే అధికారం తమకు లేదన్నారు. త్వరలో ఎన్నికల రానున్నాయని, రైతులకు వద్దకెళ్ళి ఓట్లు అడగాల్సి ఉంటుందని, ఈ పరిస్థితుల్లో ఏ సమస్యలు ఉత్పన్నం కాకూడదని సూచించారు. అనంతరం 2024-25 బడ్జెట్‌ను ఆమోదిస్తూ తీర్మానం చేశారు. సమావేశంలో సీఈవో కృష్ణవేణి, డీసీఎంఎస్ ఛైర్మన్ యార్లగడ్డ భాగ్యలక్ష్మీ, పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

మాచర్ల • గురజాల • సత్తెనపల్లి • పెదకూరపాడు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

దాచేపల్లి సభను విజయవంతం చేయాలి

• కార్యకర్తలకు దిశా నిర్దేశం చేసిన యరపతినేని

దాచేపల్లి, ఫిబ్రవరి 29 : దాచేపల్లి సమీపంలో మార్చి 2వ తేదీన జరిగే గురజాల రా.. కదలిరా... బహిరంగసభను విజయవంతం చేసేందుకు ప్రతి కార్యకర్త సన్నద్ధం కావాలని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక కల్యాణ మండపంలో గురువారం నాలుగు మండలాల పార్టీ నాయకులు, ముఖ్యులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఎన్నికలకు ముందు గురజాలలో చంద్రబాబు బహిరంగసభను విజయవంతం చేసేందుకు ప్రతి వార్డు, గ్రామం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో హాజరుకావాలని సూచించారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి ప్రారంభమయ్యే బహిరంగ సభలో టీడీపీ అధినేత చంద్రబాబు పార్టీ నాయకులకు, కార్యకర్తలకు రానున్న ఎన్నికలలో గెలుపు దిశగా ఏ విధంగా పనిచేయాలనే కార్యాచరణను ఈ వేదిక నుండే సూచించనున్నారు. గురజాల నియోజకవర్గం నుంచి సుమారు 60 వేల మంది హాజరుకావాలని, మిగిలిన నియోజకవర్గాల నుంచి వచ్చే వారితో కలుపుకొని లక్ష మందితో సభను జయప్రదం చేద్దామన్నారు. అనంతరం సభా ప్రాంగణాన్ని, హెలిపాడ్ స్థలాన్ని పరిశీలించి కార్యకర్తలకు, నాయకులకు తగిన బాధ్యతలను అప్పగించారు. సమావేశంలో యరపతినేని తనయుడు సాయినిఖిల్, గుంటుపల్లి నాగేశ్వరరావు, డాక్టర్ కర్నాటి వరలక్ష్మీ, పులుకూరి కాంతారావు, జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, సయ్యద్ అమీర్‌అలీ, కనిగిరి శ్రీను, పాండురంగ శ్రీను, కొమ్మినేని రామచంద్రరావు, బెల్లంకొండ భద్రి, గండికోట వెంకటేశ్వర్లు, బడిగుంచల వెంకటేశ్వర్లు, కటకం అంకారావు, కామిశెట్టి రమేష్, వేముల వినోద్‌రెడ్డి, కూరపాటి హనుమంతరావు, పగడాల భాస్కరరావు, రుద్రాల అచ్చారావు, తంగెళ్ల శ్రీనివాసరావు, ఎల్‌విఆర్, పిల్లి చెన్నారావు, పణితి రవి, శివనాగు, వున్నం సురేష్, ముప్పాళ్ల సాంబయ్య, ముళ్ళం శ్రీను, మామిడి చంద్రశేఖర్, యడ్లపల్లి రామారావు, కొల్లి కృష్ణమూర్తి, ముసులూరి సుబ్బారావు, చల్లాపల్లి నరసింహారావు, కాశిమళ్ల శౌరిబాబు, నెల్లూరి రామకోటయ్య, వేముల తిరుమలకుమార్, పురంశెట్టి పరంజ్యోతి, కోరె రామారావు, అక్కినపల్లి బాలయ్య, చికెన్ జానీబాషా, చింతపల్లి హసన్ అహ్మద్, నర్రా పుల్లయ్య, కూరాకుల నాగేశ్వరరావు, రఫీ, తదితరులున్నారు.

● దాచేపల్లి, ఫిబ్రవరి 29 : దాచేపల్లిలో మార్చి 2వ తేదీన జరిగే రా.. కదలిరా... సభను కాపులు విజయవంతం చేయాలని ఉమ్మడి గుంటూరు జిల్లా కాపునాడు అధ్యక్షుడు కె.ఉదయ్‌భాస్కర్ కాపులకు విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు వైసీపీని వీడి టీడీపీలో చేరడం మంచి పరిణామమని, చంద్రబాబు సమక్షంలో పార్టీలో చేరుతున్న నేపథ్యంలో కాపులు అధికంగా తరలివచ్చి మద్దతు తెలియజేయాలన్నారు.

నాలుగుసార్లు గెలిచి నీరు కూడా అందించలేదు

• టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బ్రహ్మరెడ్డి

కారంపూడి, ఫిబ్రవరి 29 : నియోజకవర్గంలో నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన పీఆర్కే కనీసం తాగు, సాగునీరు కూడా అందించలేదని టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి మండిపడ్డారు. మండలంలోని ఒప్పిచర్లలో గురువారం శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి తిరునాళ్ల మహోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ప్రత్యేక పూజల్లో పాల్గొని వీరబ్రహ్మేంద్రస్వామి ఆశీస్సులతో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన అధికారంలోకి వచ్చి ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ప్రజలు నీరు కూడా లేక ఇబ్బంది పడుతుంటే వారి వైపు చూసే వారే కరువయ్యారన్నారు. నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి ఆలయంలో ప్రజలు ఇబ్బంది పడుతుంటే పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న బ్రహ్మారెడ్డి

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి : యాగంటి

మాచర్ల రూరల్, ఫిబ్రవరి 29: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ సీనియర్ నేత, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు అన్నారు. పట్టణంలోని ఒకటో వార్డులో గురువారం బాబు షూరిటీ - భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ టీడీపీ మేనిఫెస్టోను వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, గాజుల చిన వీరాంజనేయులు, వీరు, రమేష్, జానీ, చిట్టేటి శ్రీను, అన్నారావు, మస్తాన్‌వలి, పుల్లారావు, కోటేశ్వరరావు, కొండలు, ప్రసాద్, జనసేన నేతలు లాలా, మదీన్, లక్ష్మణ్ పాల్గొన్నారు.



బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీలో పాల్గొన్న టీడీపీ నేతలు

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

దాచేపల్లి, ఫిబ్రవరి 29 : ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దాచేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ టిజె చంద్రశేఖర్‌రావు గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం నుంచి జరిగే పరీక్షలకు మొదటి సంవత్సరం విద్యార్థులు 460 మంది, రెండవ సంవత్సరం విద్యార్థులు 520 మంది హాజరుకానున్నట్లు చెప్పారు. విద్యార్థులకు హాల్ టిక్కెట్లు పూర్తి స్థాయిలో అందించామని, ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. విద్యార్థులు అరగంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని చెప్పారు.

మెడికల్ కళాశాల భవనాలను పరిశీలించిన కలెక్టర్

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 29: పిడుగురాళ్ల సమీపంలో నిర్మించిన మెడికల్ కళాశాల భవనాలను కలెక్టర్ లోతేటి శివశంకర్, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి గురువారం పరిశీలించారు. పల్నాడు ప్రాంతానికి మెడికల్ కళాశాల మంజూరు కావడం పల్నాడు వాసులకు ఆరోగ్యపరంగా శుభపరిణామమన్నారు. మొదటి ఫేజ్‌లో 100 పడకల ఆసుపత్రి భవనం పూర్తి చేయడం జరిగిందని, జూన్ నెలలో వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయని కలెక్టర్ వివరించారు. అనంతరం ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ మరికొద్ది రోజుల్లో మెడికల్ కళాశాల, ఆసుపత్రి పనులన్నీ పూర్తి చేసి పల్నాడు వాసులకు అన్నిరకాల వైద్యసేవలు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, నాయకులు, మెడికల్ కళాశాల ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.




మెడికల్ కళాశాల భవనాలను పరిశీలిస్తున్న కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి తదితరులు

సైకో ముఖ్యమంత్రిని సాగనంపాలి : కన్నా

సత్తెనపల్లి, ఫిబ్రవరి 29 : రానున్న ఎన్నికల్లో సైకో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను ప్రజలు సాగనంపాలని టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ పిలుపు నిచ్చారు. గురువారం రాత్రి మండలంలోని గోగులపాడులో టీడీపీ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలపై భారాలు మోపిందన్నారు. అహంకారంతో విర్రవీగుతున్న వైఎస్ జగన్ మెడలు ప్రజలు వంచాలన్నారు. రాష్ట్ర భవిష్యత్ కోసం తెలుగుదేశం, జనసేన కూటమిని అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి ఇంటింటికి తిరిగి టీడీపీ మినీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. కన్నాకు గ్రామంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో నాయకులు ఆళ్ళ అమరేశ్వరరావు, సూర్య రామకోటిరెడ్డి, వేదులాపురపు పూర్ణచంద్రరావు, జమ్మళ్ళమూడి క్రిష్టయ్య, తన్నీరు శ్రీనివాసరావు, మొక్కపాటి రామచంద్రరావు, మండలం, గ్రామానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబు పర్యటనను జయప్రదం చేయాలి

సత్తెనపల్లి, ఫిబ్రవరి 29 : గురజాల నియోజకవర్గంలో ఈ నెల 2వ తేదీ జరగబోయే టీడీపీ రా కదలి రా సభకు సత్తెనపల్లి నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్త లు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు తాతా జయప్రకాష్ నారాయణ పిలుపునిచ్చారు. గురువారం రాత్రి పట్టణంలోని కన్నా లక్ష్మీనారాయణ కార్యాలయంలో కన్నా అధ్యక్షతన నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. కన్నా మాట్లాడుతూ టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు పాల్గొనే ఈ పర్యటనను ప్రతి ఒక్కరు విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో నాయకులు ఎలినేడి రామస్వామి, చౌట శ్రీనివాసరావు, వందనాదేవి, ఆళ్ళ అమరేశ్వరరావు, బత్తుల నాగేశ్వరరావు, పల్లపాటి పెద్దిరాజు, గోగినేని కోటేశ్వరరావు, ఆతుకూరి నాగేశ్వరరావు, నూర్ బాషా జాన్ బాబు, ఆళ్ళ సాంబయ్య, ఎన్.సత్యనారాయణ, మక్కపాటి రామచంద్ర రావు, పోట్ల ఆంజనేయులు, మందడి కాశీ ప్రసాదు తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న కన్నా లక్ష్మీనారాయణ

పది కుటుంబాలు టీడీపీలో చేరిక

సత్తెనపల్లి, ఫిబ్రవరి 29 : మండలంలోని భీమవరం గ్రామానికి చెందిన పది ఎస్సీ కుటుంబాలు గురువారం వైసీపీ నుంచి కన్నా లక్ష్మీనారాయణ సమక్షంలో టీడీపీలో చేరాయి. వారికి కన్నా పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దామచర్ల శ్రీనివాసరావు, బొజ్జా కాంతారావు, బండారు నాగరాజు, చంటి, గురవయ్య, ప్రభుదాసు, మార్కురాజు తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వెంకట నర్సమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తదితరులు

మృతుల కుటుంబాలకు ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు పరామర్శ

దాచేపల్లి, ఫిబ్రవరి 29 : దివంగత సీపీఐ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే మందపాటి నాగిరెడ్డి కుమార్తె కోలా వెంకట నర్సమ్మ మృతదేహాన్ని ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు సందర్శించి నివాళులర్పించారు. దాచేపల్లి నగర పంచాయతీ నారాయణపురంలో మృతురాలు కుమారుడు కోలా వెంకటరెడ్డి తదితరులను గురువారం ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు పరామర్శించారు. ఎంపీతో పాటు జడ్పీటీసీ జంగా వెంకట కోటయ్య, అత్తోట నరసింహారావు, మాజీ జడ్పీటీసీ కోగంటి శివన్నారాయణ, కౌన్సిలర్ షరీఫ్, పర్వతనేని రామారావు, పల్లె సమరసింహారెడ్డి, శ్రీరాములు తదితరులున్నారు.

ఎంపీపీ సంజీవరెడ్డి బాధ్యతలు స్వీకరణ

వెల్దుర్తి, ఫిబ్రవరి 29 : మండల పరిషత్ అధ్యక్షుడిగా అలుగుమల్లి సంజీవరెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. వెల్దుర్తి మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైసీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి హాజరయ్యారు. తనపై నమ్మకంతో పదవినిచ్చిన ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వెంకట్రామిరెడ్డిలకు సంజీవరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. సంజీవరెడ్డిని దుశ్శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయిమార్కొండారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి, జడ్పీటీసీలు మల్లుస్వామి, బాలునాయక్, వైసీపీ యువజన అధ్యక్షుడు శివారెడ్డి, శ్రీనివాసరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు రాయంకుల గోపాలరావు, సొసైటీ అధ్యక్షుడు పుల్లారెడ్డి, చెన్నారెడ్డి పాల్గొన్నారు.

చెన్నుని ఆలయంలో షెడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే పీఆర్కే శంకుస్థాపన



షెడ్డు శంకుస్థాపనలో ఎమ్మెల్యే పీఆర్కే

మాచర్ల రూరల్, ఫిబ్రవరి 29: పట్టణంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో షెడ్డు నిర్మాణానికి గురువారం ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి శంకుస్థాపన చేశారు. రూ.9 లక్షల వ్యయంతో ఈ షెడ్డు నిర్మాణం జరగనుంది. ఈ కార్యక్రమంలో కొత్తా వెంకటసుబ్బారావు, వంకాయల సాంబశివరావు, కొత్త శ్రీనివాసరావు, ముప్వా ప్రకాష్‌రావు, ట్రస్ట్ బోర్డు చైర్మన్ నాగేశ్వరరావు, ఈవో సాంబయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు, మాజీ చైర్మన్ బోయ రఘు రామిరెడ్డి, కౌన్సిలర్ దస్తగిరి, ముదిశెట్టి శ్రీనివాసరావు, కోఆప్షన్ మెంబర్ బిజ్జం సుధాకరరెడ్డి, పట్టణ అధ్యక్షుడు పోలా శ్రీనివాసరావు, చిలంచర్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

సచివాలయాలు.. గ్రామాభివృద్ధి భవనాలు : పీఆర్కే

కారంపూడి, ఫిబ్రవరి 29: సచివాలయాలు గ్రామాభివృద్ధి భవనాలు అని ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని నరమాలపాడులో గ్రామ సచివాలయం ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలను చేర్చడంలో వలంటీర్ వ్యవస్థ కీలకంగా మారిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బొమ్మిన సావిత్రి అల్లయ్య, జడ్పీటీసీ షేక్ షఫీ, సర్పంచ్ రామ గురవయ్య, వైసీపీ కన్వీనర్ చిలుకూరి చంద్రశేఖరరెడ్డి, కొంగర సుబ్రహ్మణ్యం, సచివాలయ కన్వీనర్ మేకల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

రాయవరం సర్పంచ్‌గా కుమారి

మాచర్ల రూరల్, ఫిబ్రవరి 29 : మండలంలోని రాయవరం సర్పంచ్‌గా నాగెండ్ల కుమారి రామ్మోహనరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి హాజరై అభినందించారు. నూతన సర్పంచ్‌ని పలువురు సన్మానించారు.

శివరాత్రి ఉత్సవాలను సమన్వయంతో నిర్వహిద్దాం : ఎంపీడీవో

రెంటచింతల, ఫిబ్రవరి 29 : ప్రముఖ శైవక్షేత్రం, కృష్ణానది ఒడ్డున గల సత్రశాలలో మార్చి 8న నిర్వహించబోయే శివరాత్రి ఉత్సవాలను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి దిగ్విజయం చేద్దామని ఎంపీడీవో పెదప్రోలు శంకరరావు కోరారు. సత్రశాలలో గురువారం వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశానికి ట్రస్ట్‌బోర్డు చైర్మన్ బి.బ్రహ్మారెడ్డి అధ్యక్షత వహించారు. దర్శనానికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలుగకుండా చేయాలన్నారు. ఎంపీపీ పి.సంపూర్ణమ్మ మాట్లాడుతూ అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, తాగునీటికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సత్రశాలకు 32 బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు డీఎం పిచ్చయ్య తెలిపారు. ఈవో నెమలిరెడ్డి, రిటైర్డ్ ఐపీఎస్ చాంద్‌నాయక్, బాలునాయక్, ఈవోపీఆర్డీ కోటేశ్వరరావు, డీటీ బ్రహ్మయ్య, ప్యాక్టరీ ప్రతినిధులు పాల్గొన్నారు.

శ్రీనివాసరావు సేవలు మరువలేనివి

రాజుపాలెం, ఫిబ్రవరి 29 : రాజుపాలెం మండలానికి సుమారు నాలుగున్నర సంవత్సరాల కాలం ఎంపీడీవోగా విధులు నిర్వహించిన తలుపుల శ్రీనివాసరావు సేవలు ఎప్పటికీ మరువలేనివని వక్తలు అన్నారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు ఉద్యోగ విరమణ సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన సభలో పలువురు వక్తలు పాల్గొని ప్రసంగించారు. అనంతరం శ్రీనివాసరావు దంపతులను శాలువాలతో అధికారులు, ప్రజాప్రతినిధులు, శ్రేయోభిలాషులు సత్కరించారు. కార్యక్రమంలో స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి సంజీవరావు, మండలాభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, ఎంపీడీవోలు సత్యనారాయణ, శ్రీనివాస రెడ్డి, మాజీ ఎంపీపీ బాసు లింగారెడ్డి, ఎంఈఓ మల్లికార్జునశర్మ ఉన్నారు.

ప్రభుత్వాసుపత్రి ప్రారంభించిన ఎమ్మెల్యే శంకరరావు

పెదకూరపాడు, ఫిబ్రవరి 29 : పెదకూరపాడులో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు గురువారం రాత్రి నరసరావుపేట వైసీపీ పార్లమెంట్ ఇన్‌చార్జ్ అనిల్‌కుమార్ యాదవ్‌తో కలసి నూతనంగా నిర్మించిన ప్రభుత్వ ఆస్పత్రి, సచివాలయం, 30 పడకల ఆస్పత్రి, రక్షిత మంచి నీటి ట్యాంక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే శంకరరావు మాట్లాడుతూ పెదకూరపాడు నియోజకవర్గాన్ని తమ ప్రభుత్వ పాలనలో 30 సంవత్సరాల్లో చేయలేని అభివృద్ధిని చేశామన్నారు. సభలో క్రోసూరు మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, మండల వైసీపీ నేతలు షేక్ మాబూ, కంకణాల శివాజీ, వైస్ ఎంపీపీ షేక్ చాంద్ బాషా, అంజుమన్ కమిటీ అధ్యక్షులు షేక్ బిలావర్, బత్తుల రాజేంద్ర, వ్యవసాయ సహకార సంఘం చైర్‌పర్సన్ కల్లి శ్రీనివాసరెడ్డి, మండల వైసీపీ నేతలు షేక్ భయంకర సుభానీ, షేక్ గఫూర్ పాల్గొన్నారు.



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకరరావు, అనిల్‌కుమార్ యాదవ్

● అమరావతి, ఫిబ్రవరి 29 : నరసరావుపేట వైసీపీ పార్లమెంట్ ఇన్‌చార్జ్ అనిల్‌కుమార్ యాదవ్ గురువారం మండల పరిధిలోని పలు గ్రామాలలో స్థానిక ఎమ్మెల్యే నంబూరు శంకరరావుతో కలసి పర్యటించారు. ముందుగా వైకుంఠపురం వేంకటేశ్వరాలయంలో పూజలు నిర్వహించి కర్లపూడి, ఎండ్రాయి, నరుకుళ్లపాడు, అమరావతి, ధరణికోట, దిడుగు, మునగోడు, అత్తలూరు గ్రామాలలో పర్యటించి కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించారు. వారి వెంట స్థానిక వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్షేత్ర పర్యటనతో పరిశ్రమలపై అవగాహన

నకరికల్లు, ఫిబ్రవరి 29 : పారిశ్రామిక ప్రాంతాలను క్షేత్ర స్థాయిలో పర్యటన చేయటం ద్వారా పరిశ్రమల నిర్వహణ తీరుపై అవగాహన పెంపొందుతుందని ఒకేషనల్ ట్రైనర్ కే.మల్లేశ్వరి అన్నారు. నకరికల్లు కేజీబీవీ విద్యార్థులు పారిశ్రామిక యాత్రలో భాగంగా గురువారం అజంతా పెంటెక్స్ కంపెనీని, జేఎన్‌టీయూ యూనివర్శిటీని సందర్శించారు. పెంటెక్ పరిశ్రమలో కాటన్ నుంచి దారం తీసే విధానాన్ని జోనల్ మేనేజర్ విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థులకు పరిశ్రమలపై వృత్తి విద్య ద్వారా మెళకువలు నేర్చుకొనే అవకాశం ఉందని ప్రిన్సిపల్ కే.లక్ష్మి తెలిపారు.

అట్టహాసంగా మిట్టగుడిపాడు తిరునాళ్ల

రెంటచింతల, ఫిబ్రవరి 29 : మండలంలోని మిట్టగుడిపాడు గ్రామ తిరునాళ్ల గురువారం అట్టహాసంగా జరిగింది. గ్రామంలో కొలువైన శివాలయం 30వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పూజారి నాగేశ్వరశర్మ నేతృత్వంలో పార్వతి సమేత నాగేశ్వరస్వామి కల్యాణం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పలువురు దంపతులు పీటల మీద కూర్చుని కల్యాణంలో పాల్గొన్నారు. అలాగే శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణాన్ని రమణాచార్యులు నేతృత్వంలో జరిపారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. భారీగా అన్నదానం చేపట్టారు. ఎస్‌ఐ కేవీ నారాయణరెడ్డి నేతృత్వంలో బందోబస్తును ఏర్పాటు చేశారు.

కన్నాను అత్యధిక మెజార్టీతో గెలిపించండి : కన్నా నాగరాజు

నకరికల్లు, ఫిబ్రవరి 29 : సత్తెనపల్లి నియోకవర్గ టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని గుంటూరు నగర మాజీ మేయర్ కన్నా నాగరాజు కోరారు. గురువారం రాత్రి నకరికల్లులో కన్నా నాగరాజు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ఎన్నికల మేనిఫెస్టోను వివరించారు. కన్నా లక్ష్మీనారాయణ గెలుపునకు టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని కన్నా నాగరాజు కోరారు.

కన్నా గెలుపునకు కృషి చేయాలి : డాక్టర్ సాయి కృష్ణ

నకరికల్లు, ఫిబ్రవరి 29 : సత్తెనపల్లి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణను గెలిపించేందుకు టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని టీడీపీ నేత డాక్టర్ సింగరాజు సాయికృష్ణ కోరారు. నకరికల్లు మండలం కుంకలగుంట గ్రామంలో టీడీపీ, జనసేన నేతలతో గురువారం రాత్రి డాక్టర్ సాయికృష్ణ సమావేశమయ్యారు. అందరూ కలసి మెలసి పని చేయాలని సూచించారు. రాష్ట్ర భవిష్యత్‌కు టీడీపీ, జనసేన కూటమితో కూడిన ప్రభుత్వం ఏర్పాటు అవసరమని డాక్టర్ సాయికృష్ణ అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పలు ఆలయాల్లో చోరీలు

• రూ.75 వేల నగదు అపహరణ

రెంటచింతల, ఫిబ్రవరి 29 : రెంటచింతలలోని శివాలయం, పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం, ఓ దుకాణంలో గురువారం వేకువ జామున చోరీలు జరిగాయి. అలాగే మరో మెడికల్ షాపులో దొంగతనానికి యత్నించారు. వివరాలిలా ఉన్నాయి. శివాలయంలోని హుండీ పగులగొట్టి రూ.50 వేల నగదు, పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో రూ.25 వేల నగదు, ఓ దుకాణంలో రూ.3 వేల నగదును అపహరించుకుపోయారు. ఆలయ చైర్మన్ పల్లెర్ల లక్ష్మారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేయగా ఏఎస్‌ఐ హనుమంతరావు తన బృందంతో వచ్చి పరిశీలన చేశారు. ద్విచక్ర వాహనంపై ఇద్దరు వ్యక్తులు వచ్చినట్లు సీసీ కెమెరాలో నిక్షిప్తమైంది.కాగా రేగుల మాణ్యంలో మేక పిల్లలను దొంగిలించడానికి వచ్చిన దొంగలను స్థానికులు వెంటపడి పట్టుకోవడానికి ప్రయత్నించి విఫలమయ్యారు. ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు మరమ్మతులకు లోనుకావడమే సమస్యకు కారణంగా భావిస్తున్నారు.

తాడేపల్లిగూడెం సభను చూసి తాడేపల్లి ప్యాలెస్ దద్దరిల్లింది : కన్నా

సత్తెనపల్లి, ఫిబ్రవరి 29 : తాడేపల్లిగూడెంలో జరిగిన టీడీపీ, జనసేన సభను చూసి తాడేపల్లి ప్యాలెస్ దద్దరిల్లిందని టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైసీపీ దొంగలకు వ్యతిరేకంగా టీడీపీ, జనసేన పోరాడుతున్నాయన్నారు. ఐదు కోట్ల రాష్ట్ర ప్రజల భవిష్యత్ కోసం టీడీపీ, జనసేన పని చేయాలన్నారు. రాష్ట్ర పునర్నిర్మాణానికి ప్రజలు చేతులు కలపాలన్నారు. జగన్‌రెడ్డి విధ్వంసాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్లాలన్నారు. రాబోయే ఎన్నికలు రాష్ట్రానికి అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం, టీడీపీ సూపర్-6 పథకాలను ప్రవేశ పెట్టిందన్నారు. టీడీపీ, జనసేన అధికారంలోకి రాగానే ప్రజా సంక్షేమానికి కృషి చేస్తామని కన్నా తెలిపారు.

వైసీపీ దొంగలకు వ్యతిరేకంగా పోరాటం : కొమ్మాలపాటి

పెదకూరపాడు, ఫిబ్రవరి 29 : టీడీపీ, జనసేన పార్టీల నేతృత్వంలో తాడేపల్లిగూడెం సభను చూసి తాడేపల్లి ప్యాలెస్ దద్దరిల్లింది అని పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వైసీపీ దొంగలకు వ్యతిరేకంగా టీడీపీ, జనసేన పోరాడుతున్నాయని, రాబోయే ఎన్నికలు రాష్ట్రానికి అత్యంత కీలకమన్నారు. ఇరుపార్టీలు చేతులు కలిపింది మా వ్యక్తిగత ప్రయోజనాలు, అధికారం కోసం కాదని, ఐదు కోట్ల రాష్ట్ర ప్రజల భవిష్యత్ కోసం చేతులు కలిపామన్నారు. ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రజలు పెట్టుకున్న కూటమి ఇది అని, రాష్ట్ర పునఃర్నిర్మాణానికి చేతులు కలపాలని, జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని విధ్వంసంలోకి తీసుకు వెళ్ళారన్నారు. వైనాట్ 175 అంటున్నాడు జగన్‌రెడ్డి అని, ఆయనకు మనం ఎందుకు ఓటు వేయాలో అడుగుతున్నామని, ఆయన ఏం సాధించాడని ఓట్లు అడుగుతారని ఆయన అన్నారు. జాబ్ క్యాలెండర్, డీఎస్సీ, ఉచిత ఇసుక ఎక్కడ అని ప్రశ్నించారు. పులివెందులలో జగన్‌రెడ్డికి ఓటమి తప్పదని, ప్రజల ప్రయోజనాల కోసం సూపర్-6ని ప్రవేశ పెట్టామన్నారు.

ఘనంగా శ్రీ భక్తాంజనేయస్వామి దేవాలయ వార్షికోత్సవం



శ్రీ భక్తాంజనేయస్వామి

సత్తెనపల్లి, ఫిబ్రవరి 29 : పట్టణంలోని మహారాష్ట్ర వీధిలో ఉన్న శ్రీ భక్తాంజనేయ స్వామి దేవస్థాన వార్షికోత్సవాన్ని గురువారం భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని సందర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వేదాంత విజయ నరసింహాచార్యులు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అనంతరం అన్న సంతర్పణ జరిగింది.

ఎస్సీ వర్గీకరణకు అడ్డుపడుతున్న జగన్ : ఎమ్మార్పీఎస్

సత్తెనపల్లి, ఫిబ్రవరి 29 : ఎస్సీ వర్గీకరణ ఉద్యమానికి సీఎం జగన్ అడ్డుపడుతున్నారని ఎమ్మార్పీఎస్ జిల్లా నేత జంగాల శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జగన్ తన ఆర్థిక నేరాలకు న్యాయవాదులను నియమించుకున్నారని, వర్గీకరణకు మాత్రం రాష్ట్రం తరుపున సుప్రీం కోర్టులో న్యాయవాదిని నియమించలేదన్నారు. మొదటిసారి వర్గీకరణకు చంద్రబాబు నాయుడు సీఎంగా ఉన్న సమయంలో న్యాయం చేశారని, ఫలితంగా 22 వేల మందికి ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చాయన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఎంపీగా ఉన్న వైఎస్ జగన్ వర్గీకరణకు అనుకూలంగా లేఖ ఇచ్చినా ఇప్పుడు ముఖ్యమంత్రిగా ప్రతికూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తమకు వ్యతిరేకంగా వ్యవహరించే ఆ పార్టీకి మాదిగలంతా దూరంగా మెలగాలని ఆయన కోరారు.

ఆస్తి నష్టం చేశారని ఫిర్యాదు

సత్తెనపల్లి, ఫిబ్రవరి 29 : పట్టణ పరిధిలో ఉన్న తన భూమిలో ఉన్న హద్దు రాళ్ళను, ఫెన్సింగ్‌ను కొంతమంది వ్యక్తులు బుధవారం రాత్రి దౌర్జన్యంగా తొలగించారని రిటైర్డు ఎస్‌ఐ వేల్పుల భాస్కరరావు గురువారం పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తన భూమిలోకి పట్టణానికి చెందిన కటకం కృష్ణ, గుంటూరు నాగేశ్వరరావు, కరీం మస్తాన్, ఆరేపల్లి ఆంజనేయులు, మరికొంత మంది గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి స్థలం చుట్టూ నిర్మించిన ఫెన్సింగ్‌ను, స్తంభాలను తొలగించారని, సిమెంట్ రేకులను ధ్వంసం చేశారని ఆయన అన్నారు. దీని వల్ల తనకు రూ.2 లక్షల మేరకు ఆస్తి నష్టం జరిగిందని, దీనిపై విచారించి తనకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

ప్రత్యేక హోదాపై డిక్లరేషన్ ఇచ్చేందుకు సిద్ధం : కాంగ్రెస్

సత్తెనపల్లి, ఫిబ్రవరి 29 : రాష్ట్రాభివృద్ధికి, ప్రత్యేక హోదాపై డిక్లరేషన్ ఇచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దాసరి జ్ఞాన్‌రాజ్‌పాల్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం తిరుపతి వేదికగా మార్చి 1న ప్రత్యేక హోదాపై డిక్లరేషన్ ఇస్తున్నామని ప్రకటించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఎంత అవసరమో అందరికీ తెలుసన్నారు. హోదా సాధనపై ఎవరికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. అన్ని పార్టీలు రాజకీయం కోసం హోదా అంశాన్ని వాడుకున్నాయన్నారు. పది సంవత్సరాలు ప్రత్యేక హోదా ఇస్తామని తిరుపతి వేదికగా ప్రధాని మోదీ మాట ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. మోదీ రాష్ట్రాన్ని మోసం చేస్తే ఇక్కడ ఉన్న పాలకపక్షం కేంద్ర ప్రభుత్వానికి ఊడిగం చేస్తుందని ఆయన పేర్కొన్నారు.

ఉపాధ్యాయుల హామీలు అమలు చేయాలి : ఏపీటీఎఫ్

సత్తెనపల్లి, ఫిబ్రవరి 29 : ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే ఉపాధ్యాయుల ఆగ్రహానికి ప్రభుత్వం గురికాక తప్పదని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మక్కెన శ్రీనివాసరావు అన్నారు. సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కార్యదర్శి మహమ్మద్ ఇబ్రహీం అధ్యక్షతన తాలూకా సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ బండి రమేష్ బాబు మాట్లాడుతూ ఉపాధ్యాయుల నియామకంలో మళ్ళీ ప్రవేశపెట్టిన అప్రెంటీ స్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. అనంతరం ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయం వద్దకు వెళ్ళి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ రాజేంద్ర ప్రసాదుకు అందించారు. కార్యక్రమంలో డీ.శ్రీనివాసరావు, బీ.శ్రీనివాసరావు, సాయిలక్ష్మి, శివారెడ్డి, ధర్మారావు, నజీర్, నాగశ్రీ, తులసీ, అత్తరున్నీసా, విజయలక్ష్మి, శ్రీదేవి, సలీమా తదితరులు పాల్గొన్నారు.

నేడు పోలీసు స్టేషన్‌లో వాహనాల వేలం

బెల్లంకొండ, ఫిబ్రవరి 29 : బెల్లంకొండ పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ఉదయం 10 గంటలకు పట్టుబడిన వాహనాలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు స్థానిక ఎస్‌ఐ రాజేష్ అన్నారు. బెల్లంకొండ పోలీసు స్టేషన్ పరిధిలో తెలంగాణ మద్యం, నాటు సారా తరలిస్తూ పోలీసులకు పట్టుబడిన వాహనాలను వేలం వేస్తున్నట్టు పేర్కొన్నారు. నాలుగు ద్విచక్ర వాహనాలు, ఒక డీజిల్ ఆటో వేలం వేస్తున్నట్టు తెలిపారు. ఆసక్తి గల వారు ముందుగా రూ.2 వేల డిపాజిట్ చెల్లించి పాటలో పాల్గొనాలని ఆయన సూచించారు. పాట దక్కని వారికి రూ.2 వేల నగదును తిరిగి ఇస్తామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

అమరావతి, ఫిబ్రవరి 29 : సత్తెనపల్లి రోడ్డులో ఈనెల 26వ తేదీ సాయంత్రం నక్కల వాగు వద్ద ద్విచక్రవాహనంపై వస్తూ గేదెలను ఢీకొని గాయాలపాలైన స్థానిక పట్నం మాలపల్లెకు చెందిన చింతగుంట్ల పుల్లయ్య(37) గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందారు. ప్రమాదం జరిగిన సమాచారం తెలుసుకున్న సీఐ బ్రహ్మం సంఘటనా స్థలానికి వచ్చి పుల్లయ్యను ఆటోలో ఎక్కించి స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తలకు బలమైన గాయం కాగా మెరుగైన వైద్యసేవల కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పుల్లయ్యకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పల్స్ పోలియోపై టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం

బెల్లంకొండ, ఫిబ్రవరి 29 : బెల్లంకొండ ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఉదయం పల్స్ పోలియోపై మండల టాస్క్‌ఫోర్స్ సమావేశం ఏర్పాటు చేసినట్టు చండ్రాజుపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి కోటేశ్వరరావు తెలిపారు. మార్చి 3న జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయటానికి సంబంధిత శాఖల అధికారులు సమావేశం కావాలని సూచించారు. సమావేశంలో కన్వీనర్‌గా ఎంపీడీవో, మండల స్థాయి అధికారులందరూ పాల్గొనాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవోతో పాటు ఏఈలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, తహసీల్దార్, ఎంఈవో తదితరులు పాల్గొన్నారు.

● దాచేపల్లి, ఫిబ్రవరి 29 : మార్చి 3వ తేదీ జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ప్రభుత్వ వైద్యులు సుచరిత, షహీనా సుల్తానా, మధు సంయుక్తంగా కోరారు. ఆదివారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలియో చుక్కలు వేస్తారని ఆరోగ్య విస్తరణ అధికారి పట్టాభి తెలిపారు. సోమ, మంగళవారాలలో కూడా ఇంటింటికి తిరిగి పోలియో చుక్కలు అందజేస్తామని వివరించారు. ఈ సమావేశంలో హెల్త్ సూపర్‌వైజర్లు గోవిందమ్మ, సరస్వతి, లక్ష్మయ్య, శివబాబు, మేరికుమారి తదితరులున్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



డంపింగ్‌యార్డును పరిశీలిస్తున్న మునిసిపల్ కమిషనర్ రవిచంద్ర రెడ్డి

మెరుగైన పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక కృషి

● మునిసిపల్ కమిషనర్ రవిచంద్రరెడ్డి

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 29: పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలో మెరుగైన పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక కృషి చేస్తున్నట్లు మునిసిపల్ కమిషనర్ సి.రవిచంద్రరెడ్డి తెలిపారు. పట్టణంలో మునిసిపల్ కమిషనర్ సి రవిచంద్రరెడ్డి గుడ్‌మార్నింగ్ విజిట్‌లో భాగంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో మునిసిపల్ సిబ్బంది నిర్వహిస్తున్న పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించారు. పట్టణంలో ప్రధాన రహదారులపై ఎటువంటి చెత్తలేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం పట్టణంలోని స్థానిక డంపింగ్ యార్డును పరిశీలించారు. డంపింగ్ యార్డులో చెత్తను డంపింగ్ చేసే సమయంలో ఒక క్రమ పద్ధతిలో డంపింగ్ చేయాలన్నారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రామకోటయ్య తదితరులు పాల్గొన్నారు.



గాంధీపార్కువద్ద రిలే నిరాహార దీక్షలో కూర్చున్న సీఐటీయూ నాయకులు, భవననిర్మాణ కార్మికులు

కార్మిక హక్కులను కాలరాస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

● ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాసా రాంబాబు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 29: రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాసా రాంబాబు అన్నారు. గురువారం పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట కలెక్టరేట్ వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మిక సంఘం ధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా కాసా రాంబాబు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు ప్రత్యేకంగా పథకాలు అవసరం లేదని ప్రభుత్వ పెద్దలు మాట్లాడడం తగదన్నారు. 1214 జీవోద్వారా భవన నిర్మాణ కార్మికులకు అమలు అవుతున్న వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలు రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేసిందన్నారు. కార్మికులలో సింహభాగంగా ఉన్న 30లక్షల మంది భవన నిర్మాణ కార్మికులకు అమలవుతున్న సంక్షేమ పథకాలు నిలిపివేయడం విడ్డూరంగా ఉందన్నారు. రానున్న ఎన్నికలలో 30లక్షల మంది భవన నిర్మాణ కార్మికులతోపాటు వారి కుటుంబ సభ్యుల ఓట్లు వైసీపీ తమకు వద్దనుకునే ధోరణితోనే వ్యవహరిస్తోందన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కాసా సాంబయ్య మాట్లాడుతూ దేశంలోని అనేక రాష్ట్రాలలో భవన నిర్మాణ కార్మికులకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయన్నారు. అనంతరం జేసీ ఏ శ్యామ్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఉప్పలపాటి రంగయ్య, వైదన వెంకట్, దాసరి వరహాలు, భవన నిర్మాణ కార్మికసంఘం నాయకుడు శౌరి మస్తాన్, జమ్ముల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. కాగా సీఐటీయూ, సీడబ్ల్యుఎఫ్ఐ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు రెండో రోజు రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు.

సజావుగా ఎన్నికలు జరగడానికి చర్యలు తీసుకోవాలి

● టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 29: చిలకలూరిపేట నియోజకవర్గంలో ఎన్నికలు సజావుగా జరగడానికి చర్యలు తీసుకోవాలని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు అన్నారు. గురువారం నరసరావుపేట పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డీఆర్‌వో కే వినాయకంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాపర్ల జగ్గారావు మాట్లాడుతూ చిలకలూరిపేట నియోజకవర్గంలోని 105 పోలింగ్ బూత్‌లలో సక్రమంగా ఎన్నికలు జరగడానికి అదనపు పోలీసు బలగాలు, సీసీ కెమెరాల నిఘా అవసరం అన్నారు. అదనపు పోలీసు బందోబస్తుతో, 2024 అసెంబ్లీ ఎన్నికలు స్వేచ్ఛగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అజారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



విరాళం చెక్కును అందజేస్తున్న దాతలు

మహంకాళి ఆలయ పునఃనిర్మాణానికి రూ.3 లక్షల విరాళం

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 29: మండలంలోని ఇసప్పాలెంలోని మహంకాళి అమ్మవారి ఆలయ పునఃనిర్మాణం కోసం నరసరావుపేటకు చెందిన జిల్లా ప్రసాద్, విజయలక్ష్మి దంపతులు రూ.3 లక్షల విలువగల చెక్కును ఆలయ కార్యనిర్వహణ అధికారి టి.సుధాకరరెడ్డికి అందజేశారు. అనంతరం ఆలయంలో మహంకాళి అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమంలో దాతలు పాల్గొన్నారు. అమ్మవారి తీర్థప్రసాదాలను ఆలయ అర్చకులు, ఆలయ కార్యనిర్వహణ అధికారి టి.సుధాకర రెడ్డి దాతలకు అందజేశారు. .

పక్కా ఆధారాలతోనే ఫాం-7 దరఖాస్తులు

● పల్నాడు జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి గంగయ్య

మతుకుమల్లి (శావల్యాపురం) ఫిబ్రవరి 29: మండలంలోని మతుకుమల్లిలో స్థానికుల ఓట్లు తొలగించేందుకు అన్యాయంగా ఫాం-7 దరఖాస్తులు పెట్టారని వైసీపీ నాయకులు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని, రెండుచోట్ల వారికి ఓట్లున్నట్లు పక్కా ఆధారాలతోనే దరఖాస్తులు పెట్టామని పల్నాడు జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి, 12వ వార్డు సభ్యుడు చింతా గంగయ్య గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ శిరివెళ్ల శ్రీనివాసరావు, శిరివెళ్ల నారాయణమ్మలకు మతుకుమల్లిలో, బొల్లాపల్లిలోని 54వ పోలింగ్ బూత్‌లో ఓట్లున్నాయని, పాలపాటి నాగేశ్వరరావుకు మతుకుమల్లిలో, రొంపిచర్ల మండలం అన్నారంలోని 63వ పోలింగ్ బూత్‌లో ఓట్లున్నాయని తెలిపారు. అనంతరం గంగయ్య మాట్లాడుతూ శావల్యాపురం రెవెన్యూ కార్యాలయం అధికారపార్టీ నాయకులకు అడ్డాగా మారిందని, సాయంత్రం 6గంటల తరువాత అధికారపార్టీ నాయకులు కార్యాలయానికి చేరుకొని అధికారులతో మంతనాలు జరుపుతున్నారని, దానికి సంబంధించిన ఆధారాలు కూడా తమవద్ద ఉన్నాయన్నారు. ఎన్నికల ప్రక్రియ జరుగుతున్న సమయంలో రెవెన్యూ అధికారులు ఇలా వైసీపీ నాయకులతో రాత్రివేళల్లో మంతనాలు జరపడం సరైన విధానం కాదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులతో ఎస్పీ రవి శంకర్‌రెడ్డి, ఏఎస్పీలు రాఘవేంద్ర, రామచంద్రరాజు తదితరులు

విశ్రాంత పోలీసు అధికారులకు ఘన సన్మానం

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 29: పల్నాడు జిల్లా పోలీసు విభాగంలో పనిచేస్తూ గురువారం పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులు పల్నాడు జిల్లా టీసీఎస్ ఎస్ఐ జీ మీరావలి, డీఎస్‌బీ ఎస్ఐ పీ వెంకటేశ్వర్లు, సత్తెనపల్లి పట్టణ పోలీసు స్టేషన్‌కు చెందిన ఏఎస్ఐ కే శ్రీహరిలను జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎస్పీ వై రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ పోలీసు శాఖలో ఇన్ని రోజులు సేవలు అందించటానికి వారికి సహకరించిన కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రాఘవేంద్ర, రామచంద్రరాజు, ఏఆర్ డీఎస్పీ జీఎం గాంధీ, ఎస్‌బీ సీఐ ప్రభాకర్, పోలీసు అసోసియేషన్ అధ్యక్షులు మాణిక్యాలరావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ-జనసేన సభతో దద్దరిల్లిన తాడేపల్లి ప్యాలెస్

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 29: టీడీపీ-జనసేన సభను చూసి తాడేపల్లి ప్యాలెస్ దద్దరిల్లిందని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు గురువారం ఒక ప్రకటనలో అన్నారు. వైసీపీ దొంగలకు వ్యతిరేకంగా తెలుగుదేశం, జనసేనలు పోరాడుతున్నాయని, రాబోయే ఎన్నికలు ఏపీకి ఎంతో కీలకం అన్నారు. టీడీపీ జనసేనలు చేతులు కలిపింది వ్యక్తిగత ప్రయోజనాల కోసం, అధికారం కోసం కాదని, ఐదు కోట్ల ప్రజల భవిష్యత్ కోసమేనన్నారు. జగన్‌రెడ్డి నిరంకుశ పాలనతో రాష్ట్రాన్ని విధ్వంసంలోకి తీసుకెళ్ళారని విమర్శించారు. టీడీపీ అన్న క్యాంటీన్‌లు తెరచి పేదలకు రూ.5లతో భోజనం పెడితే, వాటిని మూయించి జగన్‌రెడ్డి ప్రజల నోట్లో మట్టికొట్టారని అన్నారు. కరోనా సమయంలో మాస్క్ అడిగినందుకు దళిత వైద్యుడు సుధాకర్‌ను మానసిక వికలాంగుడిగా ముద్రవేసి చంపిన ఘనత వైసీపీకే దక్కిందన్నారు. ఇవన్నీ జగన్‌రెడ్డి పెత్తందారు పోకడలకు నిదర్శనమని, నాలుగున్నరేళ్ళ పాలనలో ఏమి సాధించావని వైనాట్ 175 అంటున్నావని ప్రశ్నించారు. జాబ్ క్యాలెండర్, మోగా డీఎస్సీ ఎక్కడ?, అడుగడుగునా నిరుద్యోగులను దారుణంగా వైసీపీ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. రాబోయే సాధారణ ఎన్నికలలో పులివెందులలో జగన్‌రెడ్డి ఓడిపోక తప్పదని హెచ్చరించారు. రాష్ట్ర ప్రజలకు సంక్షేమం, ప్రయోజనాల కోసం సూపర్ 6ని ప్రవేశపెట్టామని, రాష్ట్రాన్ని ఎలా అభివృద్ధి చేయాలనే బ్లూప్రింట్ టీడీపీ దగ్గర ఉందని అన్నారు.

అక్కసుతోనే పుల్లారావు తనయుడిపై కేసు

వినుకొండ, ఫిబ్రవరి 29: టీడీపీ, జనసేన జెండా సభ కో ఆర్డినేటర్ ప్రత్తిపాటి పుల్లారావుపై అక్కసుతోనే కుమారుడు శరత్‌ను పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు విమర్శించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాడేపల్లిగూడెంలో జరిగిన తెలుగుదేశం, జనసేన ఆధ్వర్యంలో నిర్వహించిన సభ సక్సెస్ అయిందని, సభకు కో ఆర్డినేటర్‌గా వ్యవహరించిన ప్రత్తిపాటిపై అక్కసుతో సంబంధం లేని కంపెనీలను అంటకట్టి కేసులు బనాయించారన్నారు. గతంలో చిలకలూరిపేటకు ప్రత్తిపాటిని ప్రకటించినప్పుడే గుక్క పట్టుకోలేని జగన్‌మోహన్‌రెడ్డి నేడు సభ సక్సెస్ చేసినందుకు కేసులు పెట్టాడన్నారు. కేసులకు ఎన్నడూ భయపడేది లేదన్నారు. తాడేపల్లిలోని సభకు రాష్ట్రంలోని మహిళలు, యువత నుంచి విశేష స్పందన లభించిందని, సక్సెస్ చేసిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ, జనసేన కలయికతో తాడేపల్లి పునాదులు కదలిపోతున్నాయని, వైసీపీ నాయకులు ఓడిపోతారనే భయంతో రాత్రుళ్లు నిద్ర కరువైందన్నారు. పోటీ చేసేందుకు వైసీపీకి అభ్యర్థులు కరువయ్యారని, లక్ష మెజార్టీతో ఓడిపోతామని తెలిసి కూడా బీసీ అనిల్‌కు నరసరావుపేట పార్లమెంటు సీటు కేటాయించి బలి చేస్తున్నారన్నారు. ఓడిపోయే సీట్లు బీసీలకు, గెలిచే సీట్లు జగన్‌మోహన్‌రెడ్డి సామాజికవర్గానికా అని ప్రశ్నించారు.

2న జరిగే రా కదిలిరా సభను జయప్రదం చేయాలి

ఈ నెల 2వ తేదీన దాచేపల్లిలో జరిగే రా కదిలిరా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ఈ కార్యక్రమానికి పలు నియోజకవర్గాల నుంచి కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొనున్నట్లు తెలిపారు. అదేవిధంగా చంద్రబాబు సమక్షంలో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలుతో పాటు మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జడ్పీటీసీ జడ్డా సుబ్బులు రామయ్యలతో పాటు కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు టీడీపీలో చేరనున్నట్లు ఆయన తెలిపారు.

'ఎంపీ సీటు, 7 నియోజకవర్గాల్లో భారీ మెజార్టీతో గెలుస్తాం'

రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి దోపిడీ, అరాచక పాలనకు రోజులు లెక్కేసి ప్రజలు మీకు సమాధి కట్టేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. నరసరావుపేట ఎంపీ సీటు పరిధిలోని 7 నియోజకవర్గాలతో పాటు ఎంపీ సీటును భారీ మెజార్టీతో గెలవబోతున్నామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ పరిశీలకుడు మానుకొండ శివప్రసాద్, లగడపాటి వెంకట్రావు, మురళీకృష్ణయాదవ్, కోటేశ్వరరావు, వీరాంజనేయరెడ్డి, ఎలిశెట్టి రంగయ్య, కాళింగరాజు తదితరులు పాల్గొన్నారు.



చాకలికుంట తండాలో పర్యటిస్తున్న చదలవాడ అరవిందబాబు

భవిష్యత్‌కు గ్యారెంటీపై ప్రచారం

రొంపిచర్ల, ఫిబ్రవరి 29: ఈ నెల 2వ తేదీన గురజాలలో జరిగే రా కదలిరా సభను జయప్రదం చేయాలని టీడీపీ ఇన్‌చార్జ్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. గురువారం మండలంలోని చాకలికుంట తండాలో బాబు షూరిటీ, భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేనిఫెస్టో గురించి వివరించారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు రావాలన్నా, రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా టీడీపీతోనే సాధ్యమని పేర్కొన్నారు. 2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అత్యధిక ఎంపీ, ఎమ్మెల్యే సీట్లు సాధిస్తుందన్నారు. వైసీపీ అల్లరి మూకలు ఎలాంటి దాడులకు తెగబడినా భయపడేది లేదన్నారు. ప్రతి ఒక్క టీడీపీ కార్యకర్తకు, నాయకుడికి అండగా ఉంటుందన్నారు. రాష్ట్రంలో జనసేన, టీడీపీ కూటమి అత్యధిక స్థానాలు కైవసం చేసుకుంటుందన్నారు. కార్యక్రమంలో పులుకూరి జగ్గయ్య, గాడిపర్తి సురేష్, పల్లెల నాగిరెడ్డి, గంగూరి రవి, రమాకృష్ణ, మెట్టు వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాటి కుమారుడి అరెస్టు అక్రమం: శ్రీనివాసరావు

నాదెండ్ల, ఫిబ్రవరి 29: మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు కుమారుడు శరత్‌బాబును అరెస్టు చేయటం అక్రమమని మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ గంగా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఏ కంపెనీతో సంబంధం లేని శరత్‌ను జీఎస్టీ పేరుతో ముందస్తు నోటీసు లేకుండా అరెస్టుచేయటం వెనుక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాత్ర ఉందని వివరించారు. అభివృద్ధి చేయటం చేతగాని ఈ ప్రభుత్వం తప్పుడు కేసులుపెట్టి భయభ్రాంతులకు గురిచేస్తుందన్నారు. ఇలాంటి కేసులకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు భయపడరన్నారు.



యడ్లపాడులో జరిగిన మహాశక్తి కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి జరీనా సుల్తానా, టీడీపీ నాయకులు

టీడీపీ మినీ మేనిఫెస్టోపై ప్రచారం

యడ్లపాడు, ఫిబ్రవరి 29: మండల కేంద్రమైన యడ్లపాడులో బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ నాయకులు బుధవారం రాత్రి నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. శివాలయం వీధి, రజక కాలనీ, మసీదు బజారు, మేదర వీధులలో పర్యటించారు. ఇంటింటికీ తిరిగి టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ప్రకటించిన మినీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ అధికారంలోకి వస్తే మహిళలకు అమలు చేయనున్న సంక్షేమ పథకాలు, చేకూరనున్న లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో నియోజవర్గ మహిళా అధ్యక్షురాలు అమరా రమాదేవి, ప్రధాన కార్యదర్శి పోపూరి లక్ష్మి, పట్టణ అధ్యక్షురాలు అనితాబాయి, ఉపాధ్యక్షురాలు వనితాబాయి, పట్టణ సెక్రటరీ రాయి పద్మ, పార్లమెంట్ కమిటీ మెంబర్ హనీఫా, గ్రామ టీడీపీ నాయకులు పోపూరి ప్రసాదు, వెంకటరత్తయ్య, పోపూరి నాగచౌదరి, పోపూరి వీరాంజనేయులు, పోపూరి బ్రహ్మయ్య, ఉప్పలపాటి శీతారామయ్య, పల్లపు బలరాం, పోపూరి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలకు సర్వం సిద్ధం

వినుకొండటౌన్, ఫిబ్రవరి 29: నేటి నుంచి జరిగే ఇంటర్ పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. వినుకొండ నియోజకవర్గంలో మొత్తం 1263మంది విద్యార్థినీవిద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు పరీక్షల అధికారి తిరుపతి గురువారం తెలిపారు. వినుకొండ గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో 425మంది, చీకటీగలపాలెం ఏపీ మోడల్ పాఠశాలలో 223, గీతమ్స్ జూనియర్ కళాశాల 232, ఉప్పలపాడు సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో 383మంది మొత్తం 1263మంది పరీక్షలకు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. సాధారణ విద్యార్థులకు మార్చి 15వ తేదీ వరకు, ఒకేషనల్ విద్యార్థులకు 18వ తేదీ నాటికి పరీక్షలు ముగియనున్నట్లు ఆయన తెలిపారు.

మూడు ద్విచక్రవాహనాలు మాయం

వినుకొండ టౌన్, ఫిబ్రవరి 29: పట్టణంలో ఇటీవల రాత్రి ఇంటి ముందు పెట్టిన ద్విచక్ర వాహనాలు తెల్లారికే సరికే మాయమవుతున్న సంఘటనలు వినుకొండలో పరిపాటిగా మారాయి. రైల్వేస్టేషన్ రోడ్డులో బుధవారం రాత్రి మూడు ద్విచక్ర వాహనాలు మాయమవడంతో స్థానికుల్లో తీవ్ర ఆందోళన నెలకొని ఉంది. స్టేషన్ మొదటి బజారులో ఏనుగుపాలెం శ్రీనివాసరావు, 2వ బజారులో వెంకటాచారి, 3వ బజారులో బాజీలకు చెందిన ద్విచక్రవాహనాలను దొంగలు దొంగిలించారు. తెల్లవారు ఉదయం 5 గంటల సమయంలో ఒక వ్యక్తిబండిని నెట్టుకుంటూ తీసుకెళ్తుండగా పెట్రోల్ కోసం వెళ్తున్నారని స్థానికులు భావించారు. అయితే ఉదయం బండ్లు పోయాయయని బాధితులు రోడ్డెక్కడంతో స్థానికులు బైక్ దొంగల తీరుపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పుల్లారావు కుమారుడి అరెస్టు రాజకీయ కక్షసాధింపే

● టీడీపీ నరసరావుపేట నియోజవర్గ ఇన్‌చార్జి డాక్టర్ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 29: చిలకలూరిపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీమంత్రి పత్తిపాటి పుల్లారావు కుమారుడు శరత్ అక్రమ అరెస్టు రాజకీయ కక్ష సాధింపేనని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్ది పత్తిపాటి పుల్లారావుకు ప్రజలలో పెరుగుతున్న ఆదరాభిమానాలు చూసి ఓర్వలేక వైసీపీ అక్రమ అరెస్టులకు తెరలేపిందని మండిపడ్డారు. ఏ కంపెనీలో షేర్ హోల్డర్, డైరెక్టర్‌గా లేని శరత్ జీఎస్టీ ఎలా ఎగవేస్తారని ప్రశ్నించారు. శరత్‌ను తీసుకెళ్ళింది అసలు పోలీసులేనా? లేక జగన్ తాడేపల్లి ముఠానా అనే అనుమానం ఉందన్నారు. శరత్ అరెస్టును రహస్యంగా ఉంచడానికి కారణం ఏమిటని, శరత్ ఏమైనా ఉగ్ర వాదా అని మండిపడ్డారు. పత్తిపాటి పుల్లారావుకు ప్రజలలో ఉన్న ఆదరాభిమానాలు చూసి చిలకలూరిపేట వైసీపీ అభ్యర్థి పోటీ నుంచి తప్పుకుంటానని జగన్‌కు చెప్పడంతోనే జగన్ పుల్లారావు కుటుంబాన్ని అక్రమ కేసులలో ఇరికిస్తానని, ప్రజలలో పుల్లారావుకు ఉన్న ఆదరాభిమానాలు దూరం చేస్తానని మాట ఇచ్చారని, ఇచ్చిన మాటప్రకారం శరత్‌ను అరెస్టు చేయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిలకలూరిపేటలో పుల్లారావును చూస్తే వైసీపీ నేతలు ఓటమి భయంతో వణికిపోతున్నారని, మంత్రి విడదల రజని గుంటూరుకు పారిపోయిందన్నారు. చిలకలూరిపేట వైసీపీ అభ్యర్థి రాజస్థాన్ పారిపోవడానికి సిద్ధంగా ఉన్నారని ఎద్దేవా చేశారు. వైసీపీ ఎన్ని అక్రమ కేసులు పెట్టినా, కుట్ర రాజకీయాలు చేసినా పత్తిపాటి పుల్లారావు గెలుపును ఆపలేరని, శరత్‌పై పెట్టిన అక్రమ కేసులు వెంటనే ఎత్తివేసి శరత్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌డీవో శ్యామలాదేవి తదితరులు

అవినీతి ఆరోపణలపై విచారణ

నాదెండ్ల, ఫిబ్రవరి 29: మండలంలోని గణపవరం గ్రామ పంచాయతీలో జరిగిన అవినీతిపై పంచాయతీరాజ్ కమిషన్ కార్యాలయ డీఎల్‌డీవో శ్యామలాదేవి బృందం గురువారం విచారణ చేపట్టారు. 2019-2022 వరకు పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన సాంబశివరావు, అప్పటి ఎంపీడీవో, గ్రామ ప్రత్యేక అధికారి ఎం.మోషేలు లక్షలాది రూపాయలు అవినీతికి పాల్పడ్డారని పంచాయతీరాజ్ కమిషన్ కార్యాలయానికి ఫిర్యాదు అందింది. గుంటూరు జిల్లా పెదకాకాని మండలం నందివెలుగుకు చెందిన బొప్పన సురేంద్ర అవకతవకలపై ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో కమిషనర్ ఆదేశాల మేరకు శ్యామలాదేవి బృందం విచారణ చేపట్టింది. గణపవరం పంచాయతీ కార్యాలయంలోని రికార్డులను బృందం సభ్యులు పరిశీలించారు. పూర్తి వివరాలు తెలిపేందుకు సమయం పడుతుందని వారు వివరించారు. విచారణలో ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్, పంచాయతీ కార్యదర్శి మారుతీబాబులు ఉన్నారు.

ఘనంగా రామాలయం పునఃప్రతిష్ఠ మహోత్సవం

శావల్యాపురం, ఫిబ్రవరి 29: మండలంలోని కారుమంచిలోని సీతారామస్వామి దేవాలయ పునఃప్రతిష్ఠ మహోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. భక్తులు పాల్గొని స్వామివార్లను దర్శించుకొని అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొని సీతారామలక్ష్మణులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తలూరులో విఘ్నేశ్వరస్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

బాల్య వివాహాల వల్ల అనర్థాలపై అవగాహన

వినుకొండటౌన్, ఫిబ్రవరి 29: మండలంలోని ఏనుగుపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో అంగన్‌వాడీల ఆధ్వర్యంలో బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. గురువారం అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు శ్రీలక్ష్మి, నాగరాజుకుమారి, శేషకుమారి గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ గురించి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎలీషా, గ్రామసర్పంచ్ మాదినేని వెంకటలక్ష్మి, విద్యాకమిటీ చైర్మన్ రావులపల్లి కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు భాగ్యలక్ష్మి, ఏసుమాణిక్యం, కస్తూరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గీతాంజలి కల్చరల్ ఫెస్ట్

వినుకొండ, ఫిబ్రవరి 29: స్థానిక గీతాంజలి స్కూల్ (మెయిన్ క్యాంపస్) వార్షికోత్సవం సందర్భంగా కల్చరల్ ఫెస్ట్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు పాల్గొన్నారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తేళ్ల కృష్ణవేణి, కరస్పాండెంట్ వై.ఎల్.కిషోర్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'ఓటర్లను ప్రభావితం చేసేందుకే పోలింగ్ కేంద్రం మార్పు'

శావల్యాపురం, ఫిబ్రవరి 29: ఎన్నికల్లో ఓటర్లను ప్రభావితం చేసి అక్రమంగా ఓట్లు వేయించుకునేందుకే అధికారపార్టీ నాయకులు 50ఏళ్ళుగా ఎన్నికలు నిర్వహిస్తున్న పోలింగ్ కేంద్రాన్ని వసతులు లేవని గ్రామసచివాలయంలోకి మార్చారని మండలంలోని గుంటుపాలెం గ్రామస్థులు వాపోయారు. తహసీల్దార్‌ను కలిసేందుకు గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయానికి వచ్చిన గుంటుపాలెం గ్రామస్థులు తహసీల్దార్ లేకపోవడంతో విషయాన్ని డీటీకి విన్నవించబోగా ఎన్నికల ప్రక్రియతో తనకు సంబంధం లేదన్నారు. పల్నాడు జిల్లా తెలుగు యువత ప్రధానకార్యదర్శి చింతా గంగయ్య, గ్రామపార్టీ అధ్యక్షుడు డి.కృష్ణ, గ్రామనాయకులు ఎం. పెదవెంకటేశ్వర్లు, హనుమంతరావు, చిన్నఅంజయ్య తదితరులు పాల్గొన్నారు.



నూజెండ్ల జడ్పీటీసీ జెడ్డా సుబ్బులు రామయ్యను సత్కరిస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు దంపతులు

వైసీపీకి జడ్పీటీసీ రాజీనామా

నూజెండ్ల, ఫిబ్రవరి 29: పార్టీలో తగిన గుర్తింపు లేకపోవటంతో జడ్పీటీసీ జడ్డా సుబ్బులు రామయ్య వైసీపీకి రాజీనామా చేసినట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతేకాకుండా గురువారం టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు గృహానికి వెళ్ళి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు జడ్పీటీసీ జెడ్డా సుబ్బులు రామయ్య దంపతులను శాలువాలతో జీవీ ఆంజనేయులు దంపతులు సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ లగడపాటి వెంకటరావు, మండల పార్టీ అధ్యక్షుడు మీసాల మురళీకృష్ణ యాదవ్, సీనియర్ టీడీపీ నాయకులు ఉన్నారు.

అమరావతి రాజధానికే కేంద్రం కట్టుబడి ఉంది

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆలోకం సుధాకర్‌బాబు

వినుకొండ టౌన్, ఫిబ్రవరి 29: అమరావతి రాజధానికే కేంద్రం కట్టుబడి ఉందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆలోకం సుధాకర్‌బాబు అన్నారు. వినుకొండ పట్టణంలో బీజేపీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించి ప్రజాపోరు కార్యక్రమాన్ని అసెంబ్లీ కన్వీనర్ యార్లగడ్డ లెనిన్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ సంక్షేమ పథకాలు అమలుచేస్తున్న తీరు, రాజధాని అమరావతికి వేలకోట్లు నిధులు ఇస్తుందని, అమరావతే రాజధాని అని కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు నియోజకవర్గంలో చేస్తున్న అవినీతి అక్రమాలు, నెలసరి వసూళ్ళ, రేషన్‌బియ్యం దొడ్డిదారి మళ్లింపు వంటి అవినీతిపై ఆయన తనదైన శైలిలో ఘాటుగా విమర్శించారు. బీజేపీ కార్యకర్తల జోలికి వస్తే వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌యాదవ్, ఒంగోలు ఇన్‌చార్జి రవిశంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి మేడం రమేష్, ఎండ్లూరి వీరయ్య, గొడవర్తి సుజాత, లక్ష్మి, గట్టుపల్లి శ్రీనివాస్, గుడిపాటి చంద్ర, పేరయ్య, కొండలు, జాన్‌బాబు, చందలూరి సుబ్బారావు, పాలడుగు రాజు తదితరులు పాల్గొన్నారు.

ద్రావిడ యూనివర్శిటీ స్టాండింగ్ కౌన్సిల్ పదవికి ముత్తినేని రాజీనామా

వినుకొండ టౌన్, ఫిబ్రవరి 29: కుప్పం ద్రావిడ యూనివర్శిటీ స్టాండింగ్ కౌన్సిల్ పదవికి వినుకొండ మండలం పెదకంచర్ల గ్రామానికి చెందిన ముత్తినేని కోటేశ్వరరావు రాజీనామా చేస్తున్నట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో పట్టణ మౌలిక సదుపాయల అభివృద్ధి సంస్థ, ఏపీ టిడ్కో స్టాండింగ్ కౌన్సిల్, జిల్లా పరిషత్, మండల పరిషత్, గ్రామ పంచాయతీ కౌన్సిల్‌గా విధులు నిర్వహిస్తూ ద్రావిడ యూనివర్శిటీకి కౌన్సిల్ సభ్యుడిగా నియమితులై వ్యక్తిగత కారణాలతో పదవికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.

ఇంటర్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

వినుకొండ, ఫిబ్రవరి 29: స్థానిక ఏబీఎం కాంపౌండ్‌లోని డీఎల్‌డీఏ చైర్మన్ లగడపాటి నివాసం వద్ద టీడీపీ యువ నాయకుడు లింగయ్య యాదవ్ జన్మదినం సందర్భంగా ఇంటర్మీడియట్ విద్యార్థులకు పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి సినీ నిర్మాత లగడపాటి శ్రీనివాస్, గంగినేని ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గంగినేని రాఘవరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో పచ్చనూతల యూనిట్ ఇన్‌చార్జి మరిడి సురేష్, రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ జానీ, టీడీపీ నాయకులు గుత్తా గోవిందయ్య, వీరగంధం ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

మూడు జిల్లాల స్థాయిలో విద్యార్థులకు టాలెంట్ టెస్ట్


చిలకలూరిపేట, ఫిబ్రవరి 29: స్థానిక ఏఎంజీ హైస్కూల్‌లో గురువారం గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పాఠశాలల స్థాయిలో విద్యార్థులకు జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. మొత్తం 960మంది విద్యార్థులు ఈ టెస్ట్‌లో పాల్గొన్నారు. 8, 9 తరగతుల వారిని సీనియర్ల విభాగంగా, 6, 7 తరగతుల వారిని జూనియర్స్‌గా, 4, 5 తరగతుల వారిని సబ్ జూనియర్స్‌గా విభజించి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ టెస్ట్‌లో విజేతలైన వారికి గురువారం సాయంత్రం చిలకలూరిపేట ఎంఈవో లక్ష్మి, రోటరీ క్లబ్‌లకు చెందిన లింగయ్య చౌదరి, తోటకూర నారాయణ, చౌదరయ్య స్కూల్ డైరెక్టర్ ప్రభాకరరెడ్డి, హెచ్‌ఎం కృపాదానం బహుమతులు అందజేశారు.



విగ్రహ ప్రతిష్ఠ పూజల్లో పాల్గొన్న మంత్రి విడదల రజిని

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి విగ్రహ ప్రతిష్ఠ

కొండవీడుకోట (యడ్లపాడు), ఫిబ్రవరి 29: మండలంలోని చారిత్రక కొండవీడు కొండలపై పునఃనిర్మాణం చేసిన లక్ష్మీనరసింహస్వామి దేవాలయం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం దేవదాయశాఖ ఆధ్వర్యంలో గురువారం వైభవంగా నిర్వహించారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వేద మంత్రోచ్ఛరణల మధ్య ధ్వజస్తంభం, గరుడ ఆళ్వార్, లక్ష్మీనరసింహస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పార్టీ నాయకులు కార్యకర్తలతో కలసి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని మంత్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా అటవీశాఖాధికారి రామచంద్రరావు, దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ మహేశ్వరరెడ్డి, పురావస్తుశాఖ ఏడీ కె.నరసింహనాయుడు, ఏఈ శ్రీనివాసరావు, దేవదాయశాఖ డీఈవో తుమ్మ సత్యనారాయణ, నరసరావుపేట ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఎండోమెంట్ కె.మంజూష, సూపరింటెండెంట్ శ్రీధర్‌రెడ్డి, కార్యనిర్వహణాధికారులు వెంకటరెడ్డి, దుర్గారావు, మాధవరెడ్డి, స్థపతి సీహెచ్ శ్రీనివాసరావు, ఆలయ ఈవో శివయ్య, కొండవీడుకోట అభివృద్ధి కమిటీ కన్వీనర్ కల్లి శివారెడ్డి, స్థానిక గ్రామస్థులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న పీడీ జోసఫ్‌కుమార్

ఉపాధి హామీ పనుల పరిశీలన

వినుకొండటౌన్, ఫిబ్రవరి 29: మండలంలోని విఠంరాజుపల్లిలో ఉపాధి హామీ పనులను డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ గురువారం పరిశీలించారు. మస్టర్ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. నీటి నిల్వ పనులు చేపట్టాలని, రైతువారీగా ఫారంపాండ్‌లు తవ్వాలని, ఫారంపాండ్ ఏర్పాటు చేయడం ద్వారా రైతులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కొలతల ప్రకారం ప్రతికూలీకి రూ.270లు వచ్చేవిధంగా కనీసం నాలుగు గంటలు పని చేసుకోవాలని సూచించారు. ఎక్కువగా జాబ్‌కార్డు కలిగిన ఎస్సీ, ఎస్టీ కుటుంబాలు పనుల్లోకి వచ్చేలా చూసుకోవాలన్నారు. 100 రోజులు కుటుంబానికి పనులు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీవో కట్టా నాగేశ్వరరావు, టీఏలు సువర్ణబాబు, నాగార్జున, నారాయణ, ఫీల్డ్ అసిస్టెంట్ సునీల్, మేట్‌లు తదితరులు పాల్గొన్నారు.